ప్రజాశక్తి

గురువారం 21 నవంబర్ 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఇసుక అక్రమాలకు అడ్డులేదా?



- వరహా నదిలో తవ్వకాలు
- ములగల్లోవ నుంచి ట్రాక్టర్లతో తరలింపు
- మంచినీటి పథకం, హెచ్‌టి లైన్ల టవర్లకు ఏర్పడనున్న ముప్పు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, కోటవురట్ల, ఎస్.రాయవరం విలేకరి

అనకాపల్లి జిల్లాలో ఉచిత ఇసుక విధానం అక్రమార్కులకు వరంగా మారింది. వినియోగదారుల మాటేమోగానీ అక్రమ వ్యాపారులు డబ్బులు వెనుకేసుకోవడానికి ఇది అవకాశమిచ్చింది. వీరు అధికార పార్టీకి కావాల్సిన వారు కావడంతో అక్రమ తవ్వకాలు, రవాణాను నియంత్రించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం ఏమీ అనలేకపోతోంది. రహదారులకు ఆనుకొనివున్న నదుల్లో ఇష్టానుసారం ట్రాక్టర్లలో ఇసుక తరలించుకుపోతున్నప్పటికీ, రెవెన్యూ, పోలీసు, మైన్స్ శాఖాధికారులు కనీస చర్య తీసుకోవడంలేదు. ఫిర్యాదులపై స్పందించినా, వెనక్కు వచ్చిన తరువాత తవ్వకాలు యథాతథంగా సాగుతున్నాయి. నదుల్లో ఇసుక తవ్వకాల నియంత్రణ బాధ్యతను కింది స్థాయిలో విఆర్‌ఒలకు అప్పగించారు. రాజకీయ ఒత్తిళ్లను భరించలేక తవ్వకాలు, రవాణాపై వారు మౌనంగా ఉంటున్నారు. కోటవురట్ల మండలం ములగల్లోవ వద్ద వరహానదిలో జాతరను తలపించేలా వాహనాల రాకపోకలున్నాయి. ఒకవైపు కూలీలు నదిలో ఇసుక తవ్వి కుప్పలువేసి, ట్రాక్టర్లకు ఎత్తుతుండగానే, మరికొన్ని ట్రాక్టర్ వచ్చి చేరుతున్నాయి.

ఇలా ట్రాక్టర్లతో ఇసుక రాత్రి, పగలు తరలించుకుపోతున్నారు. నదిలోకి ట్రాక్టర్లు దించుతున్న మలుపు వద్ద రోడ్డుకు ఎడమవైపున చెట్ల కింద వేలం దక్కించుకున్న వారికి చెందిన మనుషులు లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ల వివరాలు నోట్స్‌లో నమోదుచేస్తున్నారు. ట్రాక్టర్ ఇసుక వెయ్యి రూపాయలు, లోడ్ చేసిన కూలీలకు ఐదు వందల రూపాయల చొప్పున ఇక్కడ వసూలు చేస్తుండగా, నది నుంచి ఇసుక తీసుకెళ్తున్న వ్యాపారులు బయట డిమాండ్‌ను బట్టి వేల రూపాయలకు అమ్ముకుంటున్నారు. ట్రాక్టర్లతో తరలిస్తున్న ఇసుకకు టార్పన్ కప్పి ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లోని వివిధ ప్రాంతాలకు తీసుకెళ్లి నిల్వ చేసుకుంటున్నారు. నదిలోని నిర్మాణాలకు పైన, కిందా అర కిలోమీటర్ వరకు ఇసుక తవ్వకాలు చేపట్టకూడదు. కానీ కోటవురట్ల, ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాలకు తాగునీరు అందించడానికి రామచంద్రాపురం వద్ద నిర్మించిన ఇన్‌ఫిల్ట్రేషన్ వెల్, పంప్‌హౌస్ ఉన్నా ఇసుక తవ్వకాలు ఆపడంలేదు. ఈ తవ్వకాలు ఇలాగే కొనసాగితే ఆ నిర్మాణాలకు, నీటి వనరులకు ముప్పు ఏర్పడనుంది. పంప్‌హౌస్, ఇన్‌ఫిల్ట్రేషన్ వెల్‌కు వచ్చే ప్రమాదాన్ని గుర్తించిన గ్రామీణ నీటి సరఫరా విభాగ అధికారులు తహశీల్దార్, పోలీసు స్టేషన్‌లో చేసిన ఫిర్యాదుతో కొన్ని రోజులు తవ్వకాలు నిలిపివేసి, మళ్లీ ప్రారంభించారు. ఈ తవ్వకాలు కొనసాగితే వరహా నదిగుండా వెళ్లిన హెచ్‌టి లైన్ల ఎలక్ట్రికల్ టవర్లు దెబ్బతిననున్నాయి. అక్రమంగా ఇసుక ఎక్కడబడితే అక్కడ అందుబాటులో ఉండడంతో నక్కపల్లి జాతీయ రహదారికి ఆనుకొని ఏర్పాటుచేసిన ప్రభుత్వ ఇసుక డిపోలో ఇసుక కొనేవారు కరువయ్యాక, ఇసుక నిల్వ చేయడం ఆపేశారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్. హరేంధిర ప్రసాద్

ఇళ్ల నిర్మాణాల్లో అలసత్వం వహిస్తే చర్యలు

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : పిఎం ఆవాస్ యోజన పథకంలో భాగంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణ పనుల్లో మరింత పురోగతి సాధించాలని, అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇళ్ల నిర్మాణాల పురోగతి, ఇసుక సరఫరా, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్దేశిత లక్ష్యాల మేరకు ఇళ్ల నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలని చెప్పారు. నిర్మాణ పనుల్లో వెనుకబడిన మండల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల ప్రత్యేక అధికారులు, లే-అవుట్ ఇన్‌ఛార్జి అధికారులు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, క్షేత్ర స్థాయి అధికారులకు తగిన సహకారం అందిస్తూ అప్రమత్తం చేస్తూ పనుల్లో జోరు పెంచాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా హౌసింగ్ హెడ్ ఎ.శ్రీనివాసరావు, డిఇ కె.సూర్యారావు, యుసిడి పీడీ సత్యవేణి, జివిఎంసి అడిషనల్ కమిషనర్ బివి.రమణమూర్తి, మండల ప్రత్యేకాధికారులు, ఎఇలు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

7న సాయుధ దళాల పతాక దినోత్సవం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వచ్చే నెల 7వ తేదీన సాయుధ దళాల పతాక దినోత్సవ కార్యక్రమం జరగనుంది. స్టిక్కర్లు కారు ఫ్లాగ్స్ యొక్క పతాకాల పోస్టర్లను బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి జి.సత్యానందం, సీనియర్ సహాయకులు శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

టోల్‌గేట్ల ప్రతిపాదన విరమించాలి : సిపిఎం

వార్త 2..

ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

వార్త 2లో..

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

వార్త 3లో..

26న నిరసనను జయప్రదం చేయండి

వార్త 4లో..

విఒఎలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షులు రూపాదేవి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఎపి వెలుగు విఒఎలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్ డిమాండ్ చేశారు. ఎపి వెలుగు విఒఎ ఉద్యోగుల సంఘం (సిఐటియు) ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో చంద్రబాబు విఒఎలకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు పి.మణి మాట్లాడుతూ, బకాయి ఉన్న 4 జీతాలు వెంటనే చెల్లించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, గ్రూప్ ఇన్స్యూరెన్స్ కల్పించాలని, మహిళా మార్ట్‌లో బలవంతపు కొనుగోలు ఆపించాలని డిమాండ్ చేశారు. మూడేళ్ల కాలపరిమితి వల్ల విఒఎలపై వేధింపులు పెరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అపర్ణ, కంచెమ్మ, కోశాధికారి శ్రీలక్ష్మి, యూనియన్ జిల్లా నాయకులు వెంకటలక్ష్మి, పార్వతి, గౌరి, శారద తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : వెలుగు విలేజ్ ఆర్గనైజింగ్ అసిస్టెంట్లు (విఒఎ)కు బకాయి వేతనాలు చెల్లించాలని, అక్రమ తొలగింపులు, వేధింపులు ఆపాలని కోరుతూ అనకాపల్లి కలెక్టరేట్ వద్ద ఎపి వెలుగు వివఒ ఉద్యోగుల సంఘం (సిఐటియు)

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

విఒఎలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ ధర్నానుద్దేశించి యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.రూపాదేవి, జిల్లా గౌరవాధ్యక్షులు వివి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్ వల్ల గత 15 సంవత్సరాలకు పైగా ఇదే ఉపాధిపై ఆధారపడిన విఒఎల కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. ఎన్నికల ముందు విజయవాడ ధర్నాచౌక్‌లో జరిగిన ఉద్యమం సందర్భంగా నాటి ప్రతిపక్ష టిడిపి తరఫున వర్ల రామయ్య హాజరై తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఈ సర్క్యులర్ రద్దు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం ఆ సర్క్యులర్‌ను రద్దు చేయకపోగా, రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఈ సర్క్యులర్ ఆధారంగా మూడేళ్లు పూర్తయిన విఒఎలను మార్చుకోవచ్చని ప్రకటన చేయడం దారుణమన్నారు. అనంతరం ప్రాజెక్ట్ అధికారి శచీదేవికి, ఆర్‌డిఒ దయానిధికి వినతిపత్రం సమర్పించారు. జిల్లాలో సమస్యలపై జాయింట్ మీటింగ్ వేసి పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.సూరిబాబు, కోశాధికారి కె.లక్ష్మి ప్రసన్న, వై.లక్ష్మి, రాజేష్, మాణిక్యం, పద్మ, వెంకట లక్ష్మి, అధిక సంఖ్యలో విఒఎలు పాల్గొన్నారు.

విఎంఆర్‌డిఎ దుకాణాల అద్దె చెల్లింపునకు యాప్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విఎంఆర్‌డిఎకు చెందిన అన్ని వాణిజ్య సముదాయాల అద్దెదారులు నెలవారీ అద్దె చెల్లింపులు ఇకపై నూతనంగా రూపొందించిన యాప్ ద్వారా మరింత సులభతరంగా చెల్లించవచ్చని మెట్రోపాలిటన్ కమిషనర్ కెఎస్.విశ్వనాధన్ తెలిపారు. బుధవారం ఉదయం విఎంఆర్‌డిఎ సమావేశ మందిరంలో విఎంఆర్‌డిఎ అసెట్ మేనేజ్‌మెంట్ అప్లికేషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ కార్యదర్శి రమేష్, ముఖ్య గణాంకాధికారి హరిప్రసాద్, పరిపాలనాధికారి వెంకటేశ్వరరావు, హెచ్‌డిఎఫ్‌సి ప్రతినిధులు పాల్గొన్నారు

పీతల మూర్తి యాదవ్‌ను అరెస్టు చేయాలి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : ఎన్నో ఏళ్లుగా జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారుల పొట్టకొట్టిన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బర్తరఫ్ చేసి అరెస్టు చేయాలని న్యాయవాది పలకా శ్రీరామ్మూర్తి డిమాండ్ చేశారు. 22వ వార్డులోని చిరు వ్యాపారులను తొలగించాలని కార్పొరేటర్ మూర్తి యాదవ్ హైకోర్టు నుంచి ఆర్డర్ తీసుకొచ్చిన నేపథ్యంలో జివిఎంసి సిబ్బంది పోలీసుల సహాయంతో తొలగించడంతో చిరు వ్యాపారులు అంతా ఉపాధి కోల్పోయారన్నారు. అందుకే ఈరోజు జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద బిక్షాటన చేశారన్నారు. కార్పొరేటర్ మూర్తి యాదవ్ సామంత రాజు లాగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అనంతరం జివిఎంసి కమిషనర్‌కు వినతిపత్రం అందించారు.

ప్రత్యేక నౌకల నిర్వహణలో పోర్టు రికార్డు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : విశాఖపట్నం పోర్టు అథారిటీ 2024-25 ఆర్థిక సంవత్సరంలో అనేక కీలక ప్రత్యేక నౌకలను సమర్థవంతంగా నిర్వహించి ప్రత్యేక మైలురాళ్లను సాధించిందని విపిఎ అధికారులు తెలిపారు. విమానవాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ ప్రపంచంలో అత్యుత్తమ క్రూజ్ షిప్ "ది వరల్డ్" వంటి ప్రత్యేక నౌకల నిర్వహణ విపిఎ సామర్థ్యాన్ని మరింతగా పెంపొందించిందని, పైలట్ల కొరత ఉన్నప్పటికీ విశాఖపట్నం పోర్టు మెరైన్ డిపార్ట్‌మెంట్ ఇబ్బందులను అధిగమించి అనేక నౌకలను విజయవంతంగా నిర్వహించి కీలక విజయాలను సాధించిందని తెలిపారు.

ఎడిసిపిగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : 2012 గ్రూప్-01 బ్యాచ్‌కు చెందిన బి.శ్రీనివాసరావు బుధవారం విశాఖపట్నం సిటీ స్పెషల్ బ్రాంచ్ ఎడిసిపి ఆఫీస్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చిని మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీనివాసరావు గతంలో నగర పోలీసు శాఖలో కీలక విభాగాల్లో విధులు నిర్వర్తించి, అధికారుల మన్ననలు పొందారు.

ఇంటర్ ఐఐఎం స్పోర్ట్స్‌లో విశాఖ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఐఐఎం బెంగళూరు వేదికగా నవంబర్ 15 నుంచి 18 నిర్వహించిన ఇంటర్- ఐఐఎం స్పోర్ట్స్ టోర్నమెంట్‌లో ఐఐఎం విశాఖపట్నం విద్యార్థులు సత్తా చాటారు. ఐఐఎం విశాఖపట్నం విద్యార్థులు 27 క్రీడా విభాగాలలో పాల్గొన్నారు. మొత్తం 12 మెడల్స్‌తో 4వ స్థానంలో నిలిచారు.

టోల్‌గేట్ల ప్రతిపాదన విరమించాలి : సిపిఎం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ముఖ్యమంత్రి చంద్రబాబు అసెంబ్లీలో మాట్లాడుతూ సంక్రాంతి పండుగ నాటికి రోడ్లు అన్నింటిని బాగు చేస్తామని చెపుతూ, ఇకమీదట జాతీయ రహదారుల తరహాలో రాష్ట్ర, జిల్లా స్థాయిలోని అన్ని ప్రధాన రోడ్ల పైన టోల్ గేట్లు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడాన్ని సిపిఎం విశాఖ, అనకాపల్లి జిల్లాల కార్యదర్శులు ఎం.జగ్గు నాయుడు, కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ ఒక ప్రకటనలో ఖండించారు. దీనిని తమ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని పేర్కొన్నారు. రోడ్ల నిర్వహణను అవుట్ సోర్సింగ్ ఏజెన్సీకి అప్పగిస్తామని, వారు టోల్ ఫీజులు వసూలు చేసుకుంటారని, దీనికి ప్రజల్ని ఒప్పించాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలదేనని చెప్పడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. ఈ టోల్ గేట్లు నిర్వహణ తాము తీసుకుంటామని ఎమ్మెల్యేలు చేతులు ఎత్తడం చూస్తుంటే వీరికి ప్రజల పట్ల ఎంత చిత్త శుద్ధి ఉందో అర్థం అవుతుందని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో నిత్యవసర వస్తువులు ధరలు అన్నీ పెరిగాయని, ట్రూ అప్ చార్జీల పేరుతో విద్యుత్ భారాలు మోపారని తెలిపారు. ఇది సరిపోదన్నట్టు ఇప్పుడు రోడ్లమీద టోల్ గేట్లు పెట్టి ప్రజల నుంచి డబ్బులు వసూలు చేయాలన్న ఆలోచన తుగ్లక్ పరిపాలనను గుర్తుకు తెస్తుందని పేర్కొన్నారు. ప్రజలు పెంచుకున్న జుట్టు మీద కూడా తుగ్లక్ పన్ను వేశారని, చంద్రబాబు ఆయనను మించిపోతున్నారని ఎద్దేవాచేశారు. తక్షణమే ఈ ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండ్‌చేశారు.

విఎంఆర్‌డిఎ దుకాణాల అద్దె చెల్లింపునకు యాప్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విఎంఆర్‌డిఎకు చెందిన అన్ని వాణిజ్య సముదాయాల అద్దెదారులు నెలవారీ అద్దె చెల్లింపులు ఇకపై నూతనంగా రూపొందించిన యాప్ ద్వారా మరింత సులభతరంగా చెల్లించవచ్చని మెట్రోపాలిటన్ కమిషనర్ కెఎస్.విశ్వనాధన్ తెలిపారు. బుధవారం ఉదయం విఎంఆర్‌డిఎ సమావేశ మందిరంలో విఎంఆర్‌డిఎ అసెట్ మేనేజ్‌మెంట్ అప్లికేషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ కార్యదర్శి రమేష్, ముఖ్య గణాంకాధికారి హరిప్రసాద్, పరిపాలనాధికారి వెంకటేశ్వరరావు, హెచ్‌డిఎఫ్‌సి ప్రతినిధులు పాల్గొన్నారు

వివాహాలకు భారతీయ సంప్రదాయ నేత వస్త్రాలు



ఎక్స్‌పోలో వస్త్రాలను చూపుతున్న సంస్థ ప్రతినిధి గుప్తా

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వివాహాలకు భారతీయ సంప్రదాయ నేత వస్త్రాలను అందరూ ధరించాలని నేషనల్ సిల్క్ ఎక్స్‌పో - ఎగ్జిబిషన్ కమ్ సేల్ నిర్వాహకులు కోరారు. గ్రీన్ పార్క్ హోటల్‌లో బుధవారం ప్రారంభమైన ఎక్స్‌పో 5 రోజుల పాటు ఉంటుందని తెలిపారు. నగర ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న పండుగలను, వేడుకలను సంతోషంగా ఉత్సాహంగా జరుపుకోవడానికి నేషనల్ సిల్క్ ఎక్స్‌పో - ఎగ్జిబిషన్ కమ్ సేల్‌ను దర్శించాలని కోరారు. దేశంలోని వివిధ ప్రాంతాల సాంస్కృతిక సంప్రదాయాల సంబంధాల సమ్మిళితమైన వివిధ రాష్ట్రాలకు చెందిన మగ్గాలపైన తయారైన వస్త్రాల ఉత్పత్తులను అన్నింటిని ఒకే వేదికపై ఉంచామని తెలిపారు. దేశం వ్యాప్తంగా ఉన్న నేత కార్మికులు తమ ఉత్పత్తులను 50 శాతం వరకు తగ్గింపుతో వేల రకాల సిల్క్, కాటన్ డిజైన్ వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. డిజైనర్ బ్లౌజ్‌లు, కుర్తీలను కూడ ఎక్స్ పో లో చూడవచ్చున్నారు. ఈ ఎక్స్ పోలో మహారాష్ట్ర వారి సొగసైన పైథాని సిల్క్ చీరలు, కర్ణాటక వారి బెంగళూరు సిల్క్, సాఫ్ట్ సిల్క్, కషిదా సిల్క్ చీరలు, మధ్యప్రదేశ్ ప్రసిద్ధ చందేరి, మహేశ్వరి సిల్క్ చీరలు, పశ్చిమ బెంగాల్ బలూచారి, జమ్దానీ, టాంగైల్, ఢకాయ్ మాస్లిన్ సిల్క్, లినెన్ సారీ కాంతా వర్క్ స్టిచ్ చీరలు ఉన్నాయని తెలిపారు.

ఈ ఎక్స్‌పోలో చీరలు మాత్రమే కాక దుపట్, సల్వార్ మెటీరియల్ వివిధ డిజైన్లలో లభిస్తాయని చెప్పారు. బీహార్ టస్సార్, మట్కా, భాగల్పూర్ సిల్క్, గుజరాత్ సంప్రదాయ బంధిని, కచ్ ఎంబ్రాయిడరీ, పటోలా వస్త్రాలు, తమిళనాడు కంజీవరంతో పాటు ఎంబ్రాయిడరీ సిల్క్, జమ్ము, కాశ్మీర్ తాబీ సిల్క్ చీరలు, బనారస్ పట్టు చీరలు, జమ్దానీ, షిఫాన్ చీరలు, ఉత్తరప్రదేశ్ లక్నో చికాన్ వర్క్, రాజస్థాన్ బంధిని, బంధేజ్, హ్యాండ్-బ్లాక్ ప్రింట్లు కూడా ఉన్నాయని తెలిపారు. ప్రదర్శన, అమ్మకాలు ప్రతిరోజూ ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటలు వరకు జరుగుతాయని, అన్నిరకాల డెబిట్, క్రెడిట్ కార్డు చెల్లింపులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వివిధ మార్కెట్లు, షాపుల్లో లోడింగ్, అన్ లోడింగ్ చేస్తున్న ముఠా కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ, ఇన్స్యూరెన్స్‌తో కూడిన సమగ్ర చట్టం చేయాలని కోరుతూ ఈ నెల 26న దొండపర్తి రైల్వే డిఆర్ఎం ఆఫీస్ నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు చేపట్టే కార్మిక మహాప్రదర్శనలో విశాఖ జిల్లా ముఠా కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ పిలుపునిచ్చారు. జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో విశాఖ జిల్లా ముఠా వర్కర్స్ యూనియన్ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. పైడిరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాల నుంచి పనిచేస్తున్న ముఠా కళాశీలకు ప్రభుత్వం నుంచి ఏ విధమైన చట్టపరమైన హక్కులు లేవన్నారు. వీరు పనిచేస్తున్న సందర్భంలో ప్రమాదాల జరిగి కాళ్లు, చేతులు విరిగిపోయినా, ప్రాణాలు కోల్పోయినా పట్టించుకునే నాథుడే లేరన్నారు. ప్రభుత్వ విధానాల వల్ల పెద్దపెద్ద షాపింగ్ మాల్స్ (స్పెన్సర్స్, మోర్, స్మార్ట్, డి మార్ట్) రావడం వల్ల వీరు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ట్రాఫిక్ ఆంక్షలు వల్ల గొడౌన్స్ అన్నీ నగర శివారుకు వెళ్లిపోవడంతో ఇక్కడ ఉపాధి కోల్పోతున్నారని, కళాశీల మధ్య పనుల కోసం నిత్యం గొడవలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ముఠా కార్మికుల రక్షణ కోసం ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ గౌరవాధ్యక్షులు వై.రాజు, ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్బారావు, మేస్త్రీలు రమణ, నర్సింగరావు, అప్పల రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, నష్టాలు వస్తున్నాయని ప్రైవేటు వ్యక్తులకు దీనిని ధారాదత్తం చేయడం సరికాదని, సెయిల్‌లో విలీనం చేయాలని హెచ్‌పిసిఎల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు ఎం.కృష్ణారావు పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి 1334వ రోజుకు చేరాయి. దీక్షల్లో హెచ్‌పిసిఎల్ కాంట్రాక్ట్ వర్కర్లు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సెయిల్ వద్ద స్టీల్ ప్లాంట్‌కు అవసరమైన కోల్ ఉందన్నారు. లేదంటే స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ నెలాఖరున విశాఖపట్నం వస్తున్న ప్రధాని మోడీ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయటం లేదని స్పష్టంగా

రైళ్ల నెంబర్ల మార్పు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే మార్చి-2025 నుంచి వాల్తేరు డివిజన్ ఆధారిత ఎక్స్‌ప్రెస్ రైళ్ల నెంబర్లను మార్చాలని నిర్ణయించింది. విశాఖ- కడప తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు 17488 బదులు 18521, కడప-విశాఖపట్నం తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు 17487 బదులు 18522గా, విశాఖపట్నం - గుంటూరు ఉదయ్ ఎక్స్ ప్రెస్‌కు 22701 బదులు 22875, గుంటూరు-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ కు 22702 బదుకు 22876 గా, విశాఖపట్నం-కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్‌కు 18513, కిరండూల్-విశాఖపట్నం ఎక్స్ ప్రెస్‌కు 18514 గా సవరించారు. ఈ మార్పులు 2025 మార్చి 1వ తేదీ నుంచి అమలులోకి వస్తాయని అధికారులు తెలిపారు. విశాఖపట్నం - బనారస్ బై వీక్లీ ఎక్స్‌ప్రెస్‌కు 18311 బదులు 18523గా 2025 మార్చి 2వ తేదీ నుంచి అమలు లోకి వచ్చేలా, విశాఖపట్నం బై-వీక్లీ ఎక్స్ ప్రెస్‌కు 18312 బదులు 18524గా 2025 మార్చి 3వ తేదీ నుంచి అమలులోకి వచ్చేలా సవరించారు.

గ్యాంగ్ రేప్ నిందితులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖలో న్యాయ విద్యార్థినిపై గ్యాంగ్ రేప్ చేసిన నిందితులను కఠినంగా శిక్సించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.వనజాక్షి, ఎమ్‌డి బేగం డిమాండ్ చేశారు. ఈ మేరకు అల్లిపురం చలువతోట వద్ద బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నిందితుడు వంశీ ప్రేమ పేరుతో నమ్మించి, అనుభవించి, స్నేహితులను కూడా పురుగొల్పి పాడుచేయడం అన్యాయమన్నారు. వీడియో తీసి బెదిరిస్తూ నిరంతరమూ అనుభవించాలని చూసిన వంశీ, జగదీష్, ఆనంద్, రాజేష్‌లను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య ఉపాధ్యక్షులు ఎ.దేముడమ్మ, బి.పుష్పలత, సిహెచ్.నూకాలమ్మ, భాను, కొండమ్మ, హేమలత, ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఎపిఇపిడిసిఎల్ సిఎండికి యునైటెడ్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ వినతి

ప్రజాశక్తి-సీతమ్మధార : విద్యుత్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఆర్‌కెవిఎస్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం సీతమ్మధారలోని ఎపిఇపిడిసిఎల్ సిఎండి పృధ్వీతేజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులు రేయింబవళ్ళ, ఎండావాన, చలి వంటి ప్రతికూల పరిస్థితుల్లో ప్రాణాలను ఫణంగా పెట్టి అరకొర వేతనాలతో పనిచేస్తున్నారన్నారు. గడచిన ఐదేళ్లలో వీరి పరిస్థితి మరింత దయనీయంగా మారిందన్నారు. సబ్‌స్టేషన్లలో వాచ్‌మెన్‌లు, షిఫ్ట్ ఆపరేటర్లు ఇబ్బందికర, ప్రాణాపాయ పరిస్థితుల్లో పనిచేస్తున్నా, వారి దుస్థితిని పట్టించుకునే దిక్కు లేదన్నారు. సరైన భద్రతాచర్యలు లేకపోగా, సరిపడా సిబ్బంది లేకపోవడంతో తీవ్ర ఒత్తిళ్లకు గురై విధులను నిర్వహిస్తున్నారన్నారు .ఇటువంటి పరిస్థితుల్లో వారికి మెరుగైన జీతంతోపాటు, ఇతర సౌకర్యాలను కల్పించాల్సిన యాజమాన్యం, ప్రభుత్వం నిమ్మకు నీరేత్తినట్లు వ్యవహరించడం దుర్మార్గమన్నారు. ఇది చాలదన్నట్లు అదానీ వంటి బడాబాబులకు స్మార్ట్‌మీటర్ల బిగించే టెండర్లతోపాటు, సంస్థలోని పలు విభాగాలను గంపగుత్తంగా ధారాదత్తం చేసి ప్రయివేటుపరం చేసే చర్యలతో అనేకమంది ఉపాధి కోల్పోయే పరిస్థితి నెలకొందన్నారు. సంస్థలు చేపట్టే సంస్కరణలు, ఉద్యోగులు, కార్మికులతోపాటు ప్రజలకు ప్రయోజన కారిగా, జీవనపరిస్థితులు మెరుగుపరిచేవిగా ఉండాలే తప్ప, వారి ఉపాధిని, హక్కులను హరించేదిగా ఉండడం దుర్మార్గమన్నారు.

జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కంలలో పనిచేసే కాంట్రాక్టు కార్మికులందరినీ రెగ్యులర్ చేసి,. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, 2022 పిఆర్‌సి ఎరియర్స్ వెంటనే చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని, .హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం ఐ.టి.ఐ విద్యార్హత ఉన్న వాచ్‌మెన్లకు షిఫ్ట్ ఆపరేటర్లుగా అవకాశం కల్పించాలని, పెరుగతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు, ఇతర సౌకర్యాలను కల్పించి, ఇన్సెంటివ్‌లు ఇవ్వాలని, గతంలో మాదిరిగా ఆరునెలలకోసారి విడిఎ ఇవ్వాలని, నూతన ఏర్పడిన సర్కిళ్లలో ఖాళీలను కొత్తవారితో భర్తీ చేయాలని, కాంట్రాక్టు కార్మికుల బదిలీలను వారి అనుమతితో చేపట్టాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.20లక్షలు చెల్లించాలని, కార్మికులందరికీ హెల్త్‌కార్డులిచ్చి, ఉచిత వైద్యం కల్పించాలి, ఇతర సమస్యలన్నీ పరిష్కరించాలని కోరారు. స్మార్ట్‌మీటర్ల బిగింపుతో ఉద్యోగాలను కోల్పోయే ప్రమాదమున్నమీటరు రీడర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని కోరారు. కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపాలని, ఇప్పటికే ఉద్యోగం నుండి తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, కార్యాలయాల్లో పనిచేసే టెక్నికల్ అసిస్టెంట్స్, కంప్యూటర్ ఆపరేటర్లను స్కిల్డ్ నుండి హైస్కిల్డ్‌గా పరిగణించాలని, ఎపిఇపిడిసిఎల్ పరిధిలోని ఇన్వెన్సెస్ కంపెనీ ద్వారా పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ఎస్రో అకౌంట్ ద్వారా వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్, అధ్యక్షులు కె.సత్యారావు, సెక్షన్ ఆపరేటర్స్ నుండి పరశురాం, షిఫ్ట్ ఆపరేటర్స్ ప్రతినిధి మోహన్, స్టోర్స్ హమాలీల ప్రతినిధి ఒ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'కూటమి పాలనలో గ్రామాల అభివృద్ధి'

ప్రజాశక్తి- ఆనందపురం : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మౌలిక వసతులు కల్పనకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని మండల కూటమి నేతలు తాట్రాజు అప్పారావు, బిఆర్‌బి నాయుడు అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సహకారంతో మండలంలో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ వద్ద విలేకర్లతో మాట్లాడుతూ, గండిగుండం నుంచి రామవరం మీదుగా భీమన్న దొరపాలెం వరకు ఏడు కిలోమీటర్లు బిటి రోడ్డు నిర్మాణానికి రూ.1.60కోట్ల ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులుమంజూరయ్యాయన్నారు. దబ్బంద, అరిగి మేరక, దొంతల వారి కల్లాలు, ఆకుల వారి కల్లాలు, జిఎస్ అగ్రహారం, రామవరంలో సిసి రోడ్లు, పాలవలస, ఎల్‌వి.పాలెం, తర్లువాడ, గంభీరం, పేకేరు, వేములవలస తదితర గ్రామాలలో రూ.ఏడు కోట్లతో రోడ్లు, నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. పలు గ్రామాల్లో రూ.మూడు కోట్లతో సిసి డ్రైనేజీల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారన్నారు. కార్యక్రమంలో రామవరం సర్పంచ్ ఎర్రా పైడిరాజు, నాయకులు పాండ్రంకి అప్పలరాజు, గన్‌రెడ్డి రమేశ్, బంటు చిన్న, ఆబోతు అప్పలరాము, కట్టమూరి సోమనాయుడు, పప్పల శ్రీకాంత్ ,శేఖర్ పాల్గొన్నారు

కంప్యూటరీకరణతో సహకార సేవలు విస్తృతం

ప్రజాశక్తి -పద్మనాభం : కంప్యూటరీకరణతో పిఎసిఎస్‌ల సేవలను విస్తృతం చేరువచేయడంతోపాటు సభ్యురైతులకు సత్వరమే మరిన్ని సేవలను అందించేందుకు మార్గం సులభతరమౌతుందని జిల్లా సహకార బ్యాంకు అసిస్టెంట్ రిజిస్ట్రార్ కెఎస్‌విజి ప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని రెడ్డిపల్లి సహకార సంఘంలో 71 వ అఖిలభారత సహకార వారోత్సవాలు ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు రైతుముంగిటకు అన్ని రకాల సహకార సేవలను అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ వెంకట అప్పారావు, మజ్జివలస పిఎసిఎస్ ఇన్‌ఛార్జి పి సత్యప్రసాద్, పలు సహకార సంఘాల కార్యదర్శులు పాల్గొన్నారు.

అమెరికన్ వీసాకు దళారులను నమ్మకండి

ప్రజాశక్తి -మధురవాడ : అమెరికాలో ఉన్నత విద్యాభ్యాసానికి వచ్చే యువతలో భారతీయ విద్యార్థులే అధికంగా ఉన్నారని, అయితే వీసాకు దళారులను నమ్మి మోసపోవద్దని హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ కార్యాలయం కాన్సులర్ ఇన్ఫర్మేషన్ యూనిట్ విభాగం అధిపతి ఎస్.జెన్నె సూచించారు. బుధవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలో నిర్వహించిన కార్యక్రమంలో అమెరికాలో ఉన్నత చదువులకు వీసా పొందే విధానంపై వివరించారు. అమెరికాలోని 4500 గుర్తింపు పొందిన విద్యాసంస్థలు ఉన్నాయని, వీటిలో ప్రవేశానికి ఆసక్తిగల వారు హైదరాబాద్‌లోని కాన్సులేట్ కార్యాలయంలో ఎఫ్-1 వీసా కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. నకిలీ సర్టిఫికెట్‌లతో వీసా పొందాలనుకునే వారికి భవిష్యత్తులో అమెరికాలో ప్రవేశానికి మార్గాలు శాశ్వతంగా మూసుకు పోతాయన్నారు. వీసాకోసం జరిగే ఇంటర్యూలో విద్యార్థులు సుదీర్ఘ ప్రసంగాలు చేయకుండా వీసా అధికారితో ముఖాముఖి సమాధానాలను ఇవ్వడానికి ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. విద్యార్థుల ఆంగ్లభాషా పరిజ్ఞానం, గ్రామర్ పొరపాట్ల వంటివి తాము పెద్దగా పరిగణలోకి తీసుకోమని, ముఖ్యమైన ప్రశ్నలకు ఏ విధంగా సమాధానం ఇచ్చారనేది ప్రధానమైనదన్నారు. విద్యార్థులకు వచ్చిన మార్కులు, ఆర్థిక పరిస్థితి, అమెరికాలో ప్రవేశానికి సంబంధించిన విశ్వవిద్యాలయాల పత్రాలు ముఖ్యంగా పరిశీలిస్తామన్నారు. వీసా ఇంటర్యూలో విద్యార్థుల ఆందోళన, ఒత్తిడి అర్థం చేసుకుని స్నేహపూర్వకంగా వ్యవహరిస్తామన్నారు. వీసా ఇంటర్యూకు కావలసిన కీలక పత్రాలను విద్యార్థులకు వివరించారు. ఇంటర్యూలో వ్యవహరించాల్సిన పద్ధతులను తెలిపారు. దేశంలోని 33 కేంద్రాల ద్వారా వీసాను మంజూరు చేస్తామన్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు

పర్యావరణానికి హాని కలిగించే ఏడు ఆకుల చెట్లను తొలగించాలి

ప్రజాశక్తి -మధురవాడ: పర్యావరణానికి, ప్రజారోగ్యానికి హాని కలిగించే ఏడు అకుల చెట్లను పూర్తిగా తొలగించాలని 8వ వార్డు కార్పొరేటర్ శ్లోడగల అప్పారావు ఆధ్వర్యంలో జనసేన నాయకులు శాఖరి శ్రీనివాస్ తదితరులు కోరారు. బుధవారం జివిఎంసి రెండో జోనల్ కమిషనర్‌ను కలిసి వినతిప్రతం అందజేశారు. భీమిలి నియోజకవర్గం జివిఎంసి ఎనిమిదోవార్డు పరిధిలోని సాగర్‌నగర్ పరిసర ప్రాంతాలలో ఏడు ఆకులచెట్లు ఎక్కువగా ఉన్నాయన్నారు. వీటివల్ల ప్రజలకు ఆరోగ్యసమస్యలు తలెత్తుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో వాటిని సమూలంగా తొలగించి, వాటిస్థానే పర్యావరణానికి మేలుచేసే మొక్కలను నాటాలని కోరాఉ. దీనిపై జెడ్‌సి స్పందిస్తూ తగు చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారన్నారు కూటమి నాయకులు సుంకర హరి, సుంకర రమేష్, లోడగల వాసు పాల్గొన్నారు.

హత్య కేసులో ఇద్దరు నిందితులకు యావజ్జీవ ఖైదు

ప్రజాశక్తి -ఆనందపురం : హత్య కేసులో నిందితులకు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష , జరిమానా విధిస్తూ విశాఖపట్నం జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ తీర్పును ఇచ్చినట్లు స్థానిక పోలీసులు తెలిపారు జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగుల జగదీశ్వరరావు అందించిన వివరాలు ప్రకారం, విజయనగరం జిల్లా మోదవలస గ్రామానికి చెందిన బాడిదబోయిన రాములప్పడుకు, విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం, కురుపల్లి గ్రామానికి చెందిన నరసయ్యమ్మతో 2008లో వివాహమైంది. వీరికి ఒక బాబు, ఒక పాప సంతానం. నర్సయ్యమ్మ, తన అక్క కొడుకైన గండిబోయిన అప్పలరాజుతో వివాహేతర సంబంధం పెట్టుకోవటంతో రాములప్పడు, నర్సయ్యమ్మకు మధ్య తరచూ గొడవలు జరుగుతూ ఉండేవి..2018 ఫిబ్రవరి 13న శివరాత్రి పండుగకు నర్సయ్యమ్మ తన పిల్లలతో సహ ఆనందపురం మండలం గొట్టిపల్లి వెళ్లగా, రాములప్పడు పని ముగిసిన తరువాత గొట్టిపల్లి వెళ్లాడు. తమకు అడ్డుగా ఉన్న రాములప్పడును చంపాలని నర్సయ్యమ్మ, అతని ప్రియుడు అప్పలరాజు, అతని తమ్ముడు ఎల్లారావు పథకం రచించారు. మందు తాగేందుకు రాములప్పడును ఊరి చివర మామిడి తోటకు తీసుకెళ్లాడు, మద్యం మత్తులో గొడవపడి, రాములప్పడును కర్రలు, చేతులతో కొట్టి హత్యచేశారు. తరువాత రాములప్పడు మృతదేహాన్నిమోదవలసలోని అతని ఇంటిలో ఉంచి, పరారయ్యారు.

రాములప్పడు తమ్ముడు బాడిదబోయిన గౌరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఆనందపురం పోలీసులు, దర్యాప్తు అనంతరం నేరాభియోగపత్రాలను, సరైన సాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించారు. పోలీసుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగుల జగదీశ్వరరావు వాదనలు వినిపించగా, నిందితులపై నేరాభియోగాలు రుజువు కావటంతో గండిబోయిన అప్పలరాజుకు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష , రూ.1.20లక్షల జరిమానా, బాడిదబోయిన నరసయ్యమ్మకు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష , రూ. 60వేలు జరిమానా విధించారు. మూడవ నిందితుడు గండిబోయిన ఎల్లారావు మైనర్ కావటంతో అతనికి జువైనల్ కోర్టులో మూడేళ్లు శిక్ష విధిస్తూ 2022లోనే న్యాయమూర్తి తీర్పునిచ్చారు. జరిమానాలో రూ.1.50లక్షలను మృతుని పిల్లలకు ఇవ్వాలని, వారి సంరక్షణకు తగు చర్యలు తీసుకోవాలని న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించాలి

ప్రజాశక్తి-గోపాలపట్నం : గత ప్రభుత్వం మంజూరుచేసిన లబ్ధిదారులకే టిడ్కో ఇళ్లను కేటాయించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ డిమాండ్‌చేశారు. బుధవారం స్థానిక ముత్యమాంబ గుడి నుంచి 484 సచివాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీ మేరకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరుచేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వై.త్రినాధ్, వై.రాంబాబు, ఆసిరినాయుడు, మిన్నారావు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వృద్ధునికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని కేబీ రోడ్డులో చిన్నప్పన్నపాలెం వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడుకి తీవ్ర గాయాలయ్యాయి. సకలా సత్తిబాబు అనే వ్యక్తి చిన్నప్పన్నపాలెం జంక్షన్ వద్ద కూర్చొని ఉండగా బస్సు ఢీకొట్టింది. ప్రమాదంలో సత్తిబాబు కాలు నుజ్జు, నుజ్జు అయింది.క్షతగాత్రుడిని కుటుంబ సభ్యులు అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: మండలంలోని చెట్టుపల్లి, రోలుగుంట మండలం సరిహద్దులో నాటు సారా తయారీకి స్థావరాలపై నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్ రేవతమ్మ ఆధ్వర్యంలో ఎస్సై పి.రాజారావు, సిబ్బంది బుధవారం దాడులు చేశారు. నాలుగు వేల లీటర్ల సారా పులుపును ధ్వంసం చేశారు.

కొత్తకోట: పి.పొన్నవోలు పంచాయతీ కుముందానిపేట గ్రామ శివార్లలో నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు చేసి, 1050 లీటర్ల బెల్లం పులుపులను ధ్వంసం చేసినట్లు కొత్తకోట ఎస్సై ఎం. శ్రీనివాస్ తెలిపారు. ముందస్తు సమాచారంతో దాడి చేసి, ఐదు డ్రమ్ములతో బెల్లం పులుపులను ధ్వంసం చేశామన్నారు. పోలీసులు రావడం చూసి తయారీదారులు పరారయ్యారు.

పోలీసులకు పట్టుబడ్డ హుండీల దొంగ

ప్రజాశక్తి-సబ్బవరం : గత నెల 10న మండలంలోని రాయపురఅగ్రహారం శ్రీకృష్ణుడు గుడి హుండీని చోరీ చేసిన వ్యక్తిని ఎట్టకేలకు పటుకున్నట్లు స్థానిక సిఐ పిన్నింటి రమణ తెలిపారు. నిందితుడు శెట్టి నాయుడు ఈ నెల 19న సబ్బవరంలోని తాటిపాముల శేఖర్ టీ షాప్ వద్ద చిల్లర డబ్బులు ఇచ్చి పెద్ద నోట్లు ఇవ్వమని అడిగిన సమయంలో స్థానిక ఎస్ఐ పి.సింహాచలం సిబ్బందితో వెళ్లి పట్టుకొని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

విజయనగరం జిల్లా వేపాడ మండలం యాతపేట గ్రామానికి చెందిన నిందితుడు శెట్టి నాయుడు గతంలో దేవరాపల్లి మండలం కలిగొట్ల గ్రామంలో పైడితల్లమ్మ గుడి హుండీని, ఈ నెల 10న కె.కోటపాడు మండలం వారాడతో దుర్గాలమ్మ గుడి హుండీని చోరీ చేసినట్లు విచారణలో తేలిందని తెలిపారు అనకాపల్లి గుండాల వీధిలో అద్దె ఇంటిలో నివాసముంటున్న నిందితుని నుంచి రూ.11,554 నగదు, హోండా బైక్, ఐ ఫోన్, చోరీకి ఉపయోగించే సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

థింసా నృత్యంలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ విష్ణుమూర్తి

ప్రజాశక్తి -భీమునిపట్నం : జిల్లా నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో విశాఖనగరంలో ఇటీవల నిర్వహించిన 'యువ ఉత్సవ్' జిల్లాస్థాయి పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు థింసా నృత్యంలో రెండో బహుమతి గెలుచుకున్నట్లు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ విష్ణుమూర్తి తెలిపారు. సర్టిఫికెట్లు, జ్ఞాపిక స్వీకరించిన విద్యార్థులను బుధవారం అభినందించారు.

అన్నప్రసాదానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- సీతమ్మధార: జివిఎంసి 46వ వార్డు కైలాసపురం జంక్షన్‌లోని లక్ష్మినారాయణ ఆలయంలో ఆలయం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అయ్యప్పదీక్షాపరులకు అన్నప్రసాదానికి జివిఎంసి డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ రూ.పదివేలు ఆర్థికసాయం అందించారు. అన్నప్రసాద వితరణ కమిటీ ఆహ్వానం మేరకు బుధవారం ఆలయాన్ని సందర్శించి, స్వయంగా అయ్యప్పస్వాములకు భిక్ష వడ్డించారు. ఈ సందర్భంగా అయ్యప్పదీక్షాపరులకు ఉచిత అన్నప్రసాదాన్ని సమకూరుస్తున్న ఆలయ కమిటీని అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధి అర్జున్, స్థానిక నేతలు కె.చిన్న, ఎస్.కృష్ణ, కె.ఈశ్వరరావు, కె.లావణ్య, ఎస్.రామారావు పాల్గొన్నారు.

26న నిరసనను జయప్రదం చేయండి

మత్స్యకారుల దీక్షలకు సంఘీభావం



మత్స్యకారుల దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయం వద్ద మత్స్యకారులు చేపడుతున్న రిలేదీక్షలకు బుధవారం ఏడోరోజున సిపిఎం నాయకులు సంఘీభావం తెలిపారు.సిపిఎం జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి, నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్.అప్పల నాయుడు దీక్షాశిబిరాన్ని సందర్శించారు. అనంతరం జోనల్ కమిషనర్ పిల్లి ప్రేమ ప్రసన్నవాణిని కలిసి సమస్యలను వివరించారు. కార్యక్రమంలో మత్స్యకార ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు గంటా నూకరాజు, పిసి అప్పారావు, అల్లిపిల్లి నరసింగరావు, వి.సత్యారావు పాల్గొన్నారు. తమకు సంఘీభావం తెలిపిన సిపిఎం నేతలను మత్స్యకార జెఎసి నేతలు అభినందించి, కృతజ్ఞతలు తెలిపారు.



తగరపువలసలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి -తగరపువలస :కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై ఈనెల16న అఖిల పక్ష కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనను జయంప్రదం చేయాలని సిఐటియు భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద నిరసన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. 26న ఉదయం 10 గంటలకు డిఆర్ఎం కార్యాలయం నుంచి జివిఎంసి ప్రధాన కార్యాలయం వరకు ప్రదర్శన, సభలో పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. ఈసందర్భంగా ఆర్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ, విశాఖ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిలిపివేయాలని, కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్ అప్పలనాయుడు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

సీతమ్మధార :విశాఖ స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, నాలుగు లేబర్ కోడ్స్ రద్దు, కనీస వేతనం నెలకు రూ.26 వేలు అమలు ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 26న చేపట్టే నిరసన విజయవంతం చేయాలని సిపిఎం అక్కయ్యపాలెం జోన్ నాయకులు రాజు డిమాండ్ చేశారు. బుధవారం ఎన్ఎస్ఆర్ నగర్ కాలనీలో నిరసన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అప్పలరాజు, గౌరీష్, రమణ, శివ, శ్యాం పాల్గొన్నారు.



సీతమ్మధారలో వాల్‌పోస్టర్ల ఆవిష్కరణలో సిపిఎం నేతలు



నర్సీపట్నంలో నినాదాలు చేస్తున్న సిఐటియు నేతలు

నర్సీపట్నం టౌన్: కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 26న జరిగే నిరసనను జయప్రదం చేయాలని సిఐటియు .జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు పిలుపునిచ్చారు. బుధవారం మున్సిపల్ వర్కర్స్ సమావేశంలో మాట్లాడుతూవంటలకు గిట్టుబాటు ధర, ఇపిఎస్ పెన్షనర్లకు కనీస వేతనం రూ.9వేలు చెల్లింపు, కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్‌తో కూడిన కనీస వేతనం అమలుకు సమగ్రచట్టం చేయాలని, అధికధరలు, విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, స్మార్ట్‌మీటర్లను బిగించొద్దన్న నినాదాలతో ఆందోళన చేస్తున్నట్లు వెల్లడించారు. అన్నివర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, శివాజీ, రమణ పాల్గొన్నారు.

ప్రజల పక్షాన నిలవాలి

వైసిపి శ్రేణులకు ముత్తంశెట్టి పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ముత్తంశెట్టి

ప్రజాశక్తి -భీమునిపట్నం : అవసరమైన ప్రతి సందర్భంలోనూ ప్రజల పక్షాన నిలవాలని వైసిపి శ్రేణులకు మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు పిలుపు నిచ్చారు బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత ఐదేళ్ల వైసిపి ప్రభుత్వ హయాంలో కులం, మతం చూడకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేసినట్లు వివరించారు. అనునిత్యం ప్రజలను అంటిపెట్టుకుని ఉండాలని స్పష్టం చేశారు. సమావేశంలో పార్టీ ఇన్ఛార్జి ముత్తంశెట్టి మహేష్, జివిఎంసి నాలుగో వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు,వైస్ ఎంపిపి బి బంగారు నాయుడు, నాయకులు కె ఎల్లాజీ, టి రామ లక్ష్మణరావు పాల్గొన్నారు

వేతన బకాయిలు చెల్లించాలి

రోడ్డెక్కిన ఉక్కు ఉద్యోగుల కుటుంబసభ్యులు

వెలిగించిన కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన

స్టీల్ సిఐటియు నేతల సంఘీభావం



వెలిగించిన కొవ్వొత్తులతో మహిళల నిరసన ర్యాలీ

ప్రజాశక్తి -ఉక్కునగరం : రెండు నెలలుగాజీతాలు లేక ఇబ్బంది పడుతున్న ఉక్కు ఉద్యోగుల కుటుంబ సభ్యులు బుధవారం సాయంత్రం పిల్లల సహా రోడ్డెక్కారు. అమరవీరుల క్యాండిల్ పార్క్ జంక్షన్ నుంచి వెంకటేశ్వర గుడి వరకు వెలిగించిన కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించి, తిరిగి హిల్ టాప్ గెస్ట్ హౌస్ వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల కుటుంబ సభ్యులు పీ శిరీష ఎన్ భారతి ,ఎం నవ్య ,సుజాత, వరలక్ష్మి, లక్ష్మి, సుభాషిణి, వేణు తదితరులు మాట్లాడారు.

ఉక్కు ఉద్యోగులకు గత రెండు నెలలుగా జీతాలులేక, పలు, విద్యుత్ బిల్లులు, ఇఎంఐలు, పిల్లల స్కూల్ ఫీజులు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేసారు. తక్షణమే జీతాలు చెల్లించాలని, లేదంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. స్టీల్‌ప్లాంటుకు సొంతగనులు కేటాయింపు, సెయిల్‌లో విలీనంతోపాటు, పూర్తిసామర్థ్యంతో నడిచేలా చర్యలు చేపట్టేలా కేంద్రంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ ఒత్తిడి తేవాలనికోరారు. వీరి ఆందోళనకు సిపిఎంకార్పొరేటర్ డాక్టర్ బి గంగారావు, స్టీల్ ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు జె అయోధ్య రామ్, యు రామస్వామి, వైటి దాస్, అనేకమంది కార్మికులు సంఘీభావం తెలిపి, పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న సుభాష్‌చంద్రబోస్

ప్రజాశక్తి -ఆనందపురం: ఇటీవల గుండెపోటుతో హఠాన్మరణం పొందిన మండలంలోని ముచ్చర్ల పంచాయతీ, గొంపవానిపాలెం గ్రామానికి చెందిన గొంప రమణ కుటుంబానికి మహాలక్ష్మి కల్చరల్ అసోసియేషన్ అధినేత ఘంటమనేని సుభాష్ చంద్రబోస్ రూ. 50వేల ఆర్థిక సాయం అందజేశారు. ఇంటిపెద్దదిక్కు మరణంతో ఇబ్బందులకు గురైన బాధిత నిరుపేద కుటుంబం దుస్థితిని మాజీ సర్పంచ్ బంటుబిల్లి అప్పలనారాయణ, మరికొందరు సుభాష్‌చంద్రబోస్ దృష్టికి తేగా, ఆయన వెంటనే స్పందించి ఆర్థికసాయం అందజేశారు.

23 నుంచి సయ్యద్ ముస్తాక్ అలీ క్రికెట్ టోర్నీ

దేశవాళీ టీ20 పోటీలకు సర్వం సిద్ధం

విశాఖ, విజయనగరంలో మ్యాచ్‌ల నిర్వహణ

నగరానికి చేరుకున్న ఆయా జట్ల క్రికెటర్లు

ఎసిఎ కార్యదర్శి సానా సతీష్ బాబు

ప్రజాశక్తి -మధురవాడ : దేశవాళీ టీ20 క్రికెట్ టోర్నీ సయ్యద్‌ముస్తాక్ అలీ ట్రోఫీ క్రికెట్ పోటీలను ఈనెల 23నుంచి విశాఖపట్నం పీఎంపాలెం ఎసిఎ, విడిసిఎ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం, విజయనగరంలోని పివిజి రాజు కాంప్లెక్స్, విజ్జి స్టేడియంలలో ప్రారంభం కానున్నాయని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) కార్యదర్శి సానా సతీష్ బాబు తెలిపారు. వచ్చేనెల 5వ తేదీ వరకు జరగనున్న ఈ పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. టోర్నమెంట్‌లో అసోం, రైల్వేస్, ఛండీగఢ్, పాండిచ్చేరి, విదర్భ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌జట్లు పోటీపడనున్నాయి. ఈ మేరకు ఆయా జట్లు బుధవారం విశాఖపట్నం చేరుకున్నాయి. ఇండియా, ఐపిఎల్‌కు ప్రాతినిధ్యం వహించిన పలువురు ఆటగాళ్లు ఈ టోర్నీలో పాల్గొంటారన్నారు.

జీవనోపాధిని దూరం చేయొద్దు!

● సిఐటియు ఆధ్వర్యాన తోపుడుబళ్ల కార్మికులు ధర్నా



సిఐటియు ఆధ్వర్యాన ధర్నా చేస్తున్న చిల్లర వర్తకులు

ప్రజాశక్తి-పెందుర్తి : స్థానిక రైతుబజార్ వద్ద 29ఏళ్లుగా బతుకుతున్న తోపుడుబళ్లను యథావిధిగా కొనసాగించి, కార్మికులకు కూటమి ప్రభుత్వం ఉపాధి, రక్షణ కల్పించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కార్యదర్శి బి.జగన్ డిమాండ్ చేశారు. బుధవారం రైతు బజార్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తొలగించిన తోపుడుబళ్లను యథాస్థానంలోనే కొనసాగించాలని, హాకర్స్ జోన్ ఏర్పాటు చేయాలని, తోపుడుబండ్లు, చిల్లర వర్తక కార్మికులకు ఉపాధి కల్పించాలని నినాదాలు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన మూడునెలల్లో చిరువ్యాపారులపై దాడులు పెరిగాయని, ఫిర్యాదులొస్తున్నాయన్న కారణాలతో వీరి జీవనోపాధిని హరించే చర్యలను జివిఎంసి కమిషనర్ చేపట్టొద్దని కోరారు సిఐటియు సీనియర్ నాయకులు కె.అప్పలనాయుడు మాట్లాడుతూ తోపుడుబళ్ళ, చిరువర్తకుల ఉపాధిని హరించే చర్యలను కొనసాగిస్తే జివిఎంసిని ముట్టడిస్తామని హెచ్చరించారు. 2014 స్ట్రీట్ వెండర్స్ చట్టం ప్రకారం వీరి గుర్తింపునకు వెండింగ్ కార్డులిచ్చి, బతికే హక్కును కల్పించాలని కోరారు. జాతీయరహదారి, గ్రీన్‌బెల్ట్‌లో ఉన్న షాపింగ్ కాంప్లెక్సులు, కార్ల షోరూంల జోలికి పోకుండా, చిరువ్యాపారులకు ఇబ్బందులకు గురిచేసే చర్యలు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకులు బి రమణి, అనంతలక్ష్మి, ఎన్ రాజు, సత్యనారాయణ తారాండ్డి

మంచి నడవడిక అలవరచుకోవాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి వెంకటశేషమ్మ

ప్రజాశక్తి - ఆరిలోవ : నేర సంఘటనలో ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ పాల్గొనకుండా మంచి జీవితం గడపాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకట శేషమ్మ సూచించారు. బుధవారం దీనదయాల్‌పురం ప్రభుత్వ బాలుర పరిశీలన గృహంలో పర్యవేక్షణాధికారి కె.వీరయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల హక్కుల వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నేరప్రవృత్తికి దూరంగా ఉండాలని, భావి భారత పౌరులుగా ఉన్నత జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఐసిఐసిఐ బ్యాంక్ రిటైర్డ్ చీఫ్ మేనేజర్ బి.మణిమాల, రోటరీ క్లబ్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ సుమన, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం, జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యులు పి.సూర్య భాస్కరరావు, రోటరీ క్లబ్ అధ్యక్షులు వినయ్‌గాంధీ పాల్గొని, వివిధ పోటీల్లో విజేతలైన వారికి బహుమతులను అందజేశారు

ముగిసిన రెవెన్యూ సదస్సులు

-మద్దిలో భూసమస్యలపై 262 దరఖాస్తులు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని మద్ది గ్రామపంచాయతీలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యలపై 262 దరఖాస్తులు రైతుల నుండి వచ్చినట్లు పద్మనాభం తహశీల్దార్ ఆనంద్ కుమార్ తెలిపారు. భూములకు సంబంధించి పేర్లు మార్చాలని 227 దరఖాస్తులు, భూవిస్తీర్ణంలో తేడాలపై 32 దరఖాస్తులు. ఇతర సమస్యలపై మూడు దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. బుధవారంతో రెవెన్యూ సదస్సులు ముగిసినట్లు తెలిపారు

సివిల్స్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు

ప్రజాశక్తి-అనకాపల్లి

యూపీపీఎస్సీ నిర్వహించే సివిల్స్ పరీక్షలలో ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు సంబంధించి ఉచిత శిక్షణ పొందేందుకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, నిరుద్యోగ అభ్యర్థుల నుండి ధరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ,సాధికారిత అధికారి కె.రాజేశ్వరి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ అభ్యర్థులు ఏదైనా డిగ్రీ పూర్తి చేసి ఉండాలన్నారు. 2 ఫోటోలు, విద్యా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, పాన్ కార్డు జత పరచి నవంబరు 24 తేదీ లోగా దరఖాస్తులను ఇంటి నెంబర్ 10-06-31/7, రఘురామ కాలనీ, సర్వేపల్లి రాధా కష్ణన్ జూనియర్ కాలేజీ వీది, అనకాపల్లి, అనకాపల్లి జిల్లా చిరునామాలో గల కార్యాలయానికి నేరుగా దరఖాస్తు సమర్పించాలని కోరారు. వివరాలకు ఫోన్ నంబర్. 9885845743, 8247036596 సంప్రదించాలన్నారు. ఈ నెల 27న అభ్యర్థులు ఎంపిక పరీక్ష ఉంటుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హత పొందిన 100 మందికి ఏపీ స్టడీ సర్కిల్, బిసి భవన్, విజయవాడలో ఉచిత శిక్షణ ఇస్తారని చెప్పారు.

డిఎస్‌సి ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ గడువు పెంపు

ప్రజాశక్తి -అనకాపల్లి

మెగా డి.ఎస్.సి. ఉచిత శిక్షణ కు ధరఖాస్తుల స్వీకరణ గడువు నవంబరు 25వ తేదీవరకు పొడిగించినట్లు ఉచిత శిక్షణ కేంద్రం డైరెక్టర్, జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ, సాధికారిత అధికారి కె.రాజేశ్వరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి జిల్లాలో అర్హులైన బి.సి., ఎస్.సి., ఎస్.టి., ఈ.బి.సి కులాలకు చెందిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఇంటి నెంబర్ 10-06-31/7, రఘురామ కాలనీ, సర్వేపల్లి రాధా కష్ణన్ జూనియర్ కాలేజీ వీధి, అనకాపల్లి, అనకాపల్లి జిల్లా చిరునామాలో గల కార్యాలయానికి నేరుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరములకు ఫోన్ నెం: 9885845743 కు సంప్రదించాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు 2 నెలల పాటు ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్ నెలకు 15వందల రూపాయలు, స్టడీ మెటీరియల్కు రూ.1000 చెల్లిస్తారని తెలిపారు.

25న మద్యం రిటైల్ అవుట్ లెట్ వస్తువుల వేలం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఏపీ ఎస్‌బిసిఎల్ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు అనకాపల్లి ఐఎంఎఫ్ఎల్ డిపోలో 2019 నుంచి 2024 వరకు నడిపిన రిటైల్ మద్యం అవుట్లెట్లలో వినియోగించిన వివిధ వస్తువులను ఈనెల 25 ఉదయం 11 గంటలకు అనకాపల్లి ఐఎంఎఫ్ఎల్ డిపోలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ ఎన్ వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆస్తుల వేలంలో 156 యూనిట్ల వెస్టన్ ఫ్రీజర్, 158 యూనిట్ల డెలాయిట్ ఇన్వెర్టర్ అండ్ బ్యాటరీ, 152 యూనిట్ల గోద్రెజ్ క్యాష్ చెస్ట్, 404 యూనిట్ల టీవీఎస్ స్కానర్, 1999 యూనిట్ల టీవీఎస్ క్యాష్ కౌంటింగ్ మిషన్ ఉన్నాయని, వేలంలో పాడుకున్న వస్తువ ధర మొత్తం వెంటనే 18శాతం జిఎస్టితో చెల్లించాలన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు నకలు సమర్పించి ఐదువేల రూపాయలు ధరావత్ రుసుము చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు. ఇతర వివరాలకు 9490082854, 8985531271 నెంబర్లను సంప్రదించాలన్నారు.

పిసి.మహలనోబిస్ ఇంటర్నేషనల్ అవార్డులకు దరఖాస్తులు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : స్టాటిస్టిక్స్‌లో 2025 సంవత్సరానికి గానూ ప్రొఫెసర్ పిసి.మహలనోబిస్ ఇంటర్నేషనల్ అవార్డుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా యువజన సంక్షేమాధికారి, సెట్విస్, ముఖ్యకార్యనిర్వాహణ అధికారి ఎం.సత్యపద్మ తెలిపారు. ఈ అవార్డును ఇంటర్నేషనల్ స్టాటిస్టికల్ ఇనిస్టిట్యూట్ నెదర్లాండ్స్ నిర్వహిస్తుందని తెలిపారు. అవార్డు గురించి మరింత సమాచారం కోసం వెబ్‌సైట్‌ను https://www.isi-web.orgను సంప్రదించాలని సూచించారు. డిసెంబర్ 31వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. అవార్డు పొందిన వారికి యునైటెడ్ స్టేట్స్ డాలర్ రూ.10 వేలు నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రం, మెమోంటో, సర్టిఫికేట్ ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఎల్ అండ్ ఎం సిరీస్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఎల్ అండ్ ఎం సిరీస్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, వర్క్‌మ్యాన్, స్టాఫ్ కేడర్‌లో శాశ్వత ప్రాతిపదిక మీద నియామకం చేపట్టాలని, 5ఎఫ్ఎస్ఎస్ షిప్‌లు హిందూస్తాన్ షిప్ యార్డులోనే నిర్మించాలని మూడు రోజులు పాటు జరిగే నినాదాల కార్యక్రమంలో భాగంగా బుధవారం షిప్ యార్డు గేట్ వద్ద నినాదాలు చేశారు.

జిల్లా రోడ్లలో టోల్ ట్యాక్స్ వసూలు సరికాదు



మాట్లాడుతున్న సిపిఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లా రోడ్లు కూడా టోల్ గేట్లు పెట్టి టాక్స్ వసూలు చేయాలని నిర్ణయించడాన్ని సిపిఎం అనకాపల్లి మండల కమిటీ తీవ్రంగా ఖండించింది. స్థానిక దొడ్డి రామానాయుడు భవన్‌లో బుధవారం సిపిఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో శాంతిభద్రతలు సమస్యలు బాగా లేవని సాక్షాత్తు ఉపముఖ్యమంత్రి స్వయంగా చెప్పారని పేర్కొన్నారు. విశాఖలో లా విద్యార్థినిపై నలుగురు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని, ఇలాంటి సంఘటన రోజు రోజుకూ పెరుగుతున్నాయని, అయినప్పటికీ ప్రభుత్వ చర్యలు సరిగా లేవని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వీటిపై సక్రమంగా స్పందించాలని, లేదంటే సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కె.తేలయ్యబాబు, బొప్పే ఉమా మహేశ్వరరావు, జి. సుభాషిణి, బుగిడి నూక అప్పారావు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి మంజూరు

జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో ఇంటింటి సర్వే చేసి మరుగుదొడ్డిలేని ప్రతి ఇంటికి మరుగుదొడ్డి మంజూరు చేయాలని, డిశంబరు 10 నాటికి నిర్మాణాలు పూర్తి చేయాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ గ్రామీణ నీటి సరఫరా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరు కార్యాలయంలో జిల్లా తాగునీరు, పారిశుధ్య కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. జిల్లా కలెక్టరు మండలాల వారీగా నిర్మాణ పనులు పురోగతిని సమీక్షించారు. సమావేశంలో జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవంలో భాగంగా హమారా సౌచాలయ్ - హమారా సమ్మాన్ కార్యక్రమాన్ని మానవ హక్కుల దినోత్సవం, డిసెంబర్ 10వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామాలలో పారిశుద్యం, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో మంజూరైన వ్యక్తిగత మరుగుదొడ్లు, ప్రభుత్వ భవనాలలో మరుగుదొడ్ల నిర్మాణం, సామూహిక మరుగుదొడ్లు నిర్మాణ పనులను డిశంబరు 10వ తేదీ లోగా పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామం బహిరంగ మలవిసర్జన రహిత గ్రామం కావాలన్నారు. కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ (సి.ఎస్.సి) త్వరగా పూర్తి చేయాలని, అంగన్వాడి కేంద్రాలకు మంజూరైన మరుగుదొడ్లు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని భవనాలకు రన్నింగు వాటరు సదుపాయం కల్పించాలన్నారు. హౌసింగుకాలనీలలో మంచినీటి సరఫరా పనులు వెంటనే పూర్తిచేయాలని, పనులు పురోగతిపై రోజువారీ నివేదించాలని జిల్లా కలెక్టరు ఆదేశించారు.

పిఎసిఎస్‌ల కంప్యూటరీకరణ పూర్తి చేయాలి

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటరీకరణ పనులను వెంటనే పూర్తిచేయాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ ఆదేశించారు. కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం కో-ఆపరేటివ్, డిసిసిబి, ఆప్కాబ్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి కంప్యూటరీకరణ పనులు పురోగతిని సమీక్షించారు. కంప్యూటరీకరణ పనులు పూర్తిచేయకపోవడం, రాష్ట్ర స్థాయి సూచీలలో వెనుకబడడంపై జిల్లా కలెక్టరు అసంతృప్తి వ్యక్తం చేసారు. కంప్యూటరీకరణ పనులలో నిర్లక్ష్యం వహించే అధికారులు, సిబ్బందిపై కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. డేటా సేకరణ, అప్లోడ్ పనులను శుక్రవారం నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా కోపరేటివ్ అధికారి ఎ.ప్రేమ స్వరూపరాణి, జిల్లా కోపరేటవ్ అక్కౌంట్స్ అధికారి జి. గోవిందరావు, డిసిసిబి సిఇఒ వర్మ, ఆప్కాబ్ డిపిడిఎం రాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్


బిటి రోడ్డు నిర్మించాలని నిరసన



నిరసన తెలుపుతున్న గిరిజనులు

ప్రజాశక్తి-దేవరాపల్లి

వాలాబు నుండి దేవరాపల్లి వెళ్లాలంటే నరకం చూడాల్సి వస్తోందని, తక్షణమే బిటి రోడ్డు నిర్మాణం చేయాలని కోరుతూ సిపిఎం మండల కార్యదర్శి బిటి.దొర ఆధ్వర్యాన గిరిజనులు రోడ్డుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలాబు నుండి నిత్యం స్కూల్ పిల్లలకు, గర్భిణీ స్త్రీలు, ప్రజలు నిత్యం రాకపోకలు సాగించేటప్పుడు అష్ట కష్టాలు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సరియా జలపాతానికి పర్యాటకుల సందర్శన ఎక్కువ కావడంతో ప్రమాదకర మలుపుల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. తక్షణమే చింతలపాలెం నుండి బుచ్చింపాలెం రోడ్డుకు కలుపుతూ రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. లేకుంటే ఎంపీడీవో ఆఫీస్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పాతబోయిన అప్పలరాజు, దుప్పి నారాయణ, సోమల సింహాచలం, విజయరాజు, మహిళలు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

అమెరికా దోపిడీని కళ్లకు కట్టిన 'మేల్కొన్న ఆసియా'

ప్రజాశక్తి-అనకాపల్లి : అమెరికా సామ్రాజ్యవాదం తన దోపిడీని తీవ్రతరం చేసిన ఈ కాలంలో మేల్కొన్న ఆసియా పుస్తక ప్రాముఖ్యత పెరిగిందని జన సాహితి జిల్లా అధ్యక్షులు ఐటిఆర్వి శివాజీ రావు అన్నారు. తుమ్మపాల శాఖ గ్రంధాలయ వారోత్సవాల్లో భాగంగా జరిగిన మేల్కొన్న ఆసియా పుస్తక ఆవిష్కరణ సభకు అధ్యక్షత వహించారు. పుస్తక ఆవిష్కర్తగా జన సాహితి ప్రతినిధులు కే గౌరీ శంకర్, పుస్తక పరిచయాన్ని ఓ వి ఎస్ రామకృష్ణ చేశారు. జన సాహితి గౌరవ అధ్యక్షులు 84 ఏళ్ల కొత్తపల్లి రఘుబాబు దీనిని తెలుగులో అనువాదం చేశారన్నారు. అమెరికన్ సామ్రాజ్యవాదం తన దోపిడీని తీవ్రతరం చేసిన ఈ కాలంలో మేల్కొన్న ఆసియా పుస్తక ప్రాసంగికత మరింత పెరిగిందన్నారు. ఈ సభలో రిటైర్డ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ ఆళ్ల గోవిందరావు, కే లక్ష్మీనారాయణ, వియ్యపు సింహాచలం, పివి అప్పారావు, ఏవీవీ సత్యనారాయణ, కేకే జగన్మోహన్రావు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

డాక్టర్ ఎమ్‌డి రాజుకు సత్కారం

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని ఈ.బోనింగి ప్రాంతానికి చెందిన రియా ఫౌండేషన్ చైర్మన్, సీనియర్ జర్నలిస్ట్ ఎండి రాజుకు సోషల్ సర్వీస్ కేటగిరీలో ఢిల్లీకి చెందిన ఆసియా వేదిక ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ స్ఫూర్తి అకాడమీ యూనివర్సిటీ వారు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసిన నేపథ్యంలో ఆయన్ను మంగళవారం పరవాడ వర్కింగ్ జర్నలిస్ట్ ఫోరం సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో జర్నలిస్టు ఫోరం గౌరవాధ్యక్షులు రామస్వామి, కార్యదర్శి పైల ఈశ్వరరావు, నాయకులు ఇరుగుల లక్ష్మీ ప్రసాద్, వరహాలరావు, రెడ్డి రాధాకృష్ణ, కూండ్రపు రామకృష్ణ, ప్రేమ్ కుమార్, పవన్ కుమార్, కోడి నాని, మాకిరెడ్డి నాగేశ్వరరావు, ఎండి రాజు మిత్రుడు బండారు పైడంనాయుడు పాల్గొన్నారు.

హెరిటేజ్ డెయిరీపై రైతులకు అవగాహన


ప్రజాశక్తి-సబ్బవరం : హెరిటేజ్ డైరీ పాడి రైతులకు అండగా ఉంటుందని పైడివాడ అగ్రహారం ఎంపీటీసీ సీరం అప్పలరాజు అన్నారు. మండలంలోని పైడివాడ గ్రామం 10వ వార్డులో హెరిటేజ్ డెయిరీపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెరిటేజ్ డెయిరీ పాడి రైతులకు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ నాని, వెటర్నరీ వైద్యులు గణేష్, సెంటర్ సూపర్వైజర్ బలిరెడ్డి అప్పలరాజు, రాపర్తి కనకరాజు, రాపర్తి నాగరాజు, బల్రెడ్డి తాతబాబు, రాపర్తి కనకరాజు మరియు పాల రైతులు పాల్గొన్నారు.

చంద్రబాబు మార్క్ వంచనకు గురైన వాలంటీర్లు

ప్రజాశక్తి-అనకాపల్లి : మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి వాలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చి గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం నిజం చేయగా, నేడు చంద్రబాబు వాలంటీర్లను వంచన చేసి మోసగించారని వైసిపి జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ విమర్శించారు. ఎలక్షన్ సమయంలో జగన్ ఏర్పాటు చేసిన ఈ వ్యవస్థను ఎదుర్కోలేమని దొంగ హామీలు ఇచ్చి వారి కష్టానికి ఐదు వేలు కాదు పది వేలు ఇస్తామని వారిని మభ్య పెట్టారని గుర్తు చేశారు. జగన్ వాలంటీర్ల శ్రమను దోపిడి చేస్తున్నాడని అబద్ధం చెప్పి నేడు ఆ వ్యవస్థే లేదని శాసన మండలిలో మంత్రి వ్యంగ్యంగా సమాధానం చెప్పడం దుర్మార్గమన్నారు. వాలెంటీర్ వ్యవస్థ లేనప్పుడు హామీ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ప్రజలనే కాదు ప్రతీ వ్యవస్థను మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యని దుయ్యబట్టారు.

రోడ్డు నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి-అనకాపల్లి : కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో అనకాపల్లి మండలం కోడూరు నుండి పీతపాలెం వరకు కోటి ముప్పై లక్షల వ్యయంతో బీటీ రోడ్డు, కోడూరు ఎస్సీ కాలనీలో సీసీ డ్రైన్, రోడ్డు నిర్మాణం పనులను కూటమి నాయకులు బుధవారం పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు చదరం నాగేశ్వరరావు, బంటు రవి, భరత్ బాబు, కోడూరు నాయకులు రాకోటి అప్పారావు, కొసిరెడ్డి త్రినాథ్ పాల్గొన్నారు.



బొడ్డేడ మురళిని సత్కరిస్తున్న బత్తుల తాతయ్యబాబు

బొడ్డేడ మురళికి సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి : సుంకరమెట్ట సత్యనారాయణ స్వామి దేవస్థానం నూతన చైర్మన్‌గా నియమితులైన బొడ్డేడ మురళి, ధర్మకర్తల మండలిని ఎపి రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు బుధవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి డైరెక్టర్స్ పెంటకోట చంద్రరావు, సూరిశెట్టి బల్లమ్మ, మారిశెట్టి భాస్కరరావు, శ్రీకాకుళం గణపతి, దొడ్డి భరత్, తురకలపూడి ఈశ్వర్ పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని రావాడ పంచాయతీలో రూ.6 లక్షలతో రెండు వాటర్ ట్యాంకులు నిర్మాణ పనులను వైస్ ఎంపిపి బంధం నాగేశ్వరరావు, సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు బుధవారం ప్రారంభించారు. ధర్మారెడ్డి పేట చంద్రయ్య గారి చేలు ఆవరనలో 3 లక్షలతో ఒక ట్యాంకు, ధర్మారాయుడుపేట జంక్షన్‌లో మూడు లక్షలతో మరో ట్యాంకు నిర్మాణానికి వైసిపి ప్రభుత్వం హయాంలో జెడ్‌పి నిధులు నుండి జెడ్‌పిటిసి పిఎస్ రాజు మంజూరు చేశారు. కార్యక్రమంలో కావలి వాసు, మోటూరు సన్యాసినాయుడు పాల్గొన్నారు.

ల్యాండ్ ఫిల్లింగ్ పనులు ఆపాలి

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని తాడి గ్రామంలో ల్యాండ్ ఫిల్లింగ్ పనులు ఆపాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తాడి గ్రామాన్ని ఆనుకొని సర్వేనెంబర్ 116లో ఒకవైపు కోర్టులో కేసు ఉండగానే, గ్రామసభ వ్యతిరేకించినా రాంకీ యాజమాన్యం బరితెగించి ల్యాండ్ ఫిల్లింగ్ చేయడం దారుణమన్నారు. ప్రభుత్వం రాంకీ యాజమాన్యం చేస్తున్న అక్రమ ల్యాండ్ ఫీల్ ఆపకపోతే తాడికి మరో కాలుష్య కుంపటి పెట్టినట్లేనని పేర్కొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : కైట్స్ కళాశాల విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై బుధవారం కళాశాల ఆవరణలో సెట్విస్, యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ సర్వీస్ రిసోర్స్ పర్సన్ ఎస్ఎ బాబు మాట్లాడుతూ ఇంగ్లీష్, జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కైట్స్ కళాశాల కరస్పాండెంట్ రెడ్డి చిరంజీవి, డైరెక్టర్ల అడిగర్ల శంకర్రావు, విల్లూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం బంగారుమెట్టలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు శంకుస్థాపన చేశారు. బంగారు మెట్ట, ఎల్బిపురం గ్రామాల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గూనూరు ముల్లు నాయుడు, జి కోటేశ్వరరావు, తమరాన దాసు, స్థానిక ఎంపీటీసీ యల్లపు జగ్గారావు, మాజీ ఎంపీటీసీ దొండా శ్రీను, వడ్డాది ఉప సర్పంచ్ దాడి సూరిబాబు, సాయం శేషు పాల్గొన్నారు.

షిర్డీ సాయిబాబా మందిరం ప్రారంభం

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం కోమళ్లపూడిలో షిరిడి సాయి విగ్రహ ప్రతిష్ట ఆలయ ప్రారంభోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ ఆధ్వర్యంలో బిఎన్ రోడ్డుని ఆనుకుని బాబా మందిరాన్ని నిర్మించారు. ఈ మందిరాన్ని బుధవారం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు బుధవారం ప్రారంభించారు. సందర్భంగా విశాఖ డెయిరీ పాలకేంద్రం పాలకవర్గ సభ్యులను ఎమ్మెల్యే శాలువతో సత్కరించి అభినందించారు. అనంతరం భక్తులకు అన్నదానాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు గూనూరు మల్లు నాయుడు, పెదబాబు, ఎంపీపీ నాగేశ్వరి దేవి, జి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

శివాలయం నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-సబ్బవరం : మండల కేంద్రంలో శివాలయం నిర్మాణానికి సబ్బవరం గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ తమరాన వెంకటరమణ కుమారులు మనోజ్, దినేష్ శివాలయం గర్భ గుడికి టైల్స్, ఫ్లోరింగ్‌కి రూ.1,08,116 విరాళం బుధవారం ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో బర్ల రమణ, గెడ్డం కృష్ణ, దంగేటి నాని, దంగేటి ప్రకాష్, చింతల శ్రీను పాల్గొన్నారు.

వరిలో రెల్ల రాల్చు పురుగు ఉధృతి

ప్రజాశక్తి-అనకాపల్లి

వరిలో రెల్ల రాల్చు పురుగు అధికంగా ఉన్నట్టు గమనించామని మండల వ్యవసాయ శాఖాధికారి రంగాచారి అన్నారు. మండలంలోని తుమ్మపాల, సిహెచ్ అగ్రహారం, వల్లూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గింజ గట్టిపడిన దశలో వచ్చే రెల్ల రాల్చు పురుగు నివారణకు పర్మెత్రిన్ మందు ఎకరాకు పావు లీటర్ (400 మిల్లి లీటర్లు) వాడాలని సూచించారు. గింజ ఇంకా కొంచెం పచ్చిగా ఉన్నప్పుడు బైఫెంత్రిన్ 500 మిల్లీ లీటర్లు పిచికారి చేయడం ద్వారా రెళ్ళ రాల్చు పురుగుతోపాటు కంకినల్లి, ఆకుముడత పురుగు కూడా కొంతవరకు నియంత్రించవచ్చని పేర్కొన్నారు. రెల్లు రాల్చు పురుగుతోపాటుగా ఆకు ముడత పురుగు క్లోరాంత్రినిలిప్రోల్ 60 మిల్లి లీటర్లు చొప్పున 350 నుంచి 700 ఎకరాకు పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని సింగన్న దొరపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం ఏర్పాటు చేశారు. రైతుల పొలాలను క్షేత్ర పరిశీలన చేశారు. గ్రామాల్లో ఆర్జిఎల్ వరి రకం వేసిన రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆర్‌జిఎల్ వరి రకం గింజ గట్టి పడిన దశలో రెల్లు రాల్చు పురుగు ఉధృతంగా ఉందన్నారు. రబీ కాలానికి వేరుశనగ, పెసర, మినుము విత్తనాలు రైతు సేవ కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో రైతులు రొంగలి నాయుడు బాబు, వెలగల పైడంనాయుడు, నారపాటి రవి పాల్గొన్నారు.

యలమంచిలి : మండలంలోని తురంగలపాలెం బుధవారం మండల వ్యవసాధికారి పి.మోహనరావు ఆధ్వర్యాన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో రెల్లురాల్చు పురుగు ప్రవేశించిందని, దానికి ఆకుముడత తెగులు కూడా తోడైందని, దీన్ని గమనించిన రైతులు ఆదిలోనే చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహయకులు అరుణ, కౌన్సిలర్ మర్ణేశ్వర్‌రావు, రైతులు బాబురావు, గొర్లె వెంకటరమణ, సిద్ధిళ్ళ అప్పారావు పాల్గొన్నారు.

నక్కపల్లి : మండలంలోని కాగిత గ్రామంలో వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం వరిలో ఉధృతంగా ఉన్న రెల్లురాల్చు పురుగు నియంత్రణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజేష్, కూటమి ప్రజా ప్రతినిధులు సాయి కుమారి, సిబ్బంది నాయుడు, రాజేష్, మోహన్, రైతులు పాల్గొన్నారు.

రోలుగుంట : రైతులు వరి కోతల సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి విజయలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని కొవ్వూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎర్రంశెట్టి కాంతమ్మ, కొవ్వూరు వ్యవసాయ సలహాయ అధికారి సన్యాసినాయుడు పాల్గొన్నారు.

పద్మనాభం: మండలంలోని మండలంలోని పాండ్రంగి గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి ఎంవి.చలం మాట్లాడుతూ, ఖరీఫ్ అనంతరం ముందస్తు రబీలో చోడిపంట సాగు ద్వారా ఆదాయాన్ని పొందవచ్చన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ కుమారి పాల్గొన్నారు.

తగరపువలస : భీమిలి మండలం, తాటితూరు గ్రామంలో బుధవారం మండల వ్యవసాయ శాఖ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి బి శివ కోమలి, ఇంటర్నల్ ఇన్‌స్పెక్టర్ మాధురి, ఫీల్డ్ ఆఫీసర్ స్వాతి, విఎఎలు హరీష్, రమేష్, కృపామణి పాల్గొని, ఉత్తమ యాజమాన్య పద్ధతులు ద్వారా సాగు చేస్తున్న వరి పైర్లను పరిశీలించారు. ఒక్కొక్కరి నుంచి కిలో చొప్పున 10 మంది రైతులకు చెందిన ధాన్యం నమూనాలను సేకరించారు. పురుగు మందులు, ఎరువుల అవశేషాలు ఎంత మోతాదులో ఉన్నవీ విశ్లేషించేందుకు బెంగళూరులోని ల్యాబ్‌కు పంపిస్తామని ఎఒ శివకోమలి తెలిపారు.

సైబర్ క్రైమ్స్‌పై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ఎస్‌పి తుహిన్ సిన్హా

ప్రజాశక్తి-అనకాపల్లి

సైబర్ క్రైమ్స్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్‌పి తుహిన్ సిన్హా సూచించారు. ఎస్పీ కార్యాలయంలో బుధవారం అనకాపల్లి జిల్లాలోని వివిధ బ్యాంకు మేనేజర్లు, ప్రతినిధులతో సైబర్ క్రైమ్స్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ క్రైమ్స్ పట్ల ప్రజలకు అవగాహన లేకపోవడం వలన నగదు కోల్పోతున్నారన్నారు. జిల్లా పోలీసులు, బ్యాంకుల సమన్వయంతో సైబర్ క్రైమ్స్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించడం కోసం ప్రణాళిక సిద్ధం చేశామని చెప్పారు. సైబర్ క్రైమ్స్‌లో నగదు పోగొట్టుకున్న బాధితుల ఖాతాల నుండి ఇతర బ్యాంక్ ఖాతాలకు వెళ్లే నగదుకు సంబంధించి సమాచారాన్ని పోలీసులకు అందించడం ద్వారా బాధితులకు న్యాయం చేయవచ్చని తెలిపారు. బ్యాంకుల్లో జరిగే వివిధ నగదు లావాదేవీలు సంబంధించి 5 లక్షలు అంతకన్నా ఎక్కువ మొత్తంలో జరిగే ట్రాన్సాక్షన్‌పై నిఘా పెట్టాలన్నారు. అనుమానస్పద మ్యూల్ అకౌంట్లో జరిగే లావాదేవీలపై నిఘా ఏర్పాటు చేసి సమాచారాన్ని పోలీసులకు అందజేయాలని కోరారు. బ్యాంకులు, ఏటీఎం సెంటర్ల వద్ద లోపలా, బయటా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి ఎల్.మోహన్ రావు, డీఎస్పీలు బి.అప్పారావు, ఎం.శ్రావణి, సోషల్ మీడియా సైబర్ సెల్ ఇన్స్పెక్టర్ టి.కళ్యాణి, సైబర్ క్రైమ్ ఎస్సై బి.సురేష్ బాబు, ఐటి కోర్ సిబ్బంది, లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ట్ మేనేజర్ కె.సత్యనారాయణ, ఎస్‌బిఐ రీజినల్ మేనేజర్ శ్రీ కె.జగదీశ్వరరావు, బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి అప్పారావు నాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి మాట్లాడుతూ బస్సు సౌకర్యం లేని పాఠశాలలో జరుపబడుతున్న సబ్జెక్ట్ స్కూల్ కాంప్లెక్స్ లను బస్సు సౌకర్యం ఉన్న పాఠశాలలోకి మార్చాల్సిందిగా కోరారు. 100 రోజుల ప్రోగ్రాం లో భాగంగా హై స్కూల్స్ 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించబడుతున్న స్పెషల్ స్టడీ క్లాసెస్ నుంచి సండే, సెలవు రోజులలో మినహాయింపు ఇవ్వవలసిందిగా కోరారు.కొన్ని ఉన్నత పాఠశాలలో పిడి, పార్ట్ టైం పీఈటిలు కొనసాగుతున్నారు. అలాంటి పాఠశాలల నుంచి స్ట్రెంత్ ఎక్కువగా ఉన్న పాఠశాలలకు, అలాగే అసలు పిడి లేని పాఠశాలలలో వారిని నియమించవలసిందిగా కోరారు. ఇటీవల ప్రభుత్వం చేసిన వర్క్ అడ్జస్ట్మెంట్ కు భిన్నంగా ఎంఈఓలు సొంతంగా చేసిన వర్క్ అడ్జస్ట్మెంట్ లను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి, జిల్లా కార్యదర్శి జి ఎస్ ప్రకాష్, రాష్ట్ర కౌన్సిలర్ ఎంవి అప్పారావు, అనకాపల్లి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మామిడి బాబురావు,నాతవరపు సతీష్ , సీనియర్ నాయకులు తేజ్, ఆశ, జగన్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-పరవాడ : తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం మండలంలోని లంకెలపాలెం పరిధి గంజిపేటలో క్లస్టర్ ఇంచార్జ్, జివిఎంసి కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి సభ్యత్వం తీసుకుంటే ప్రమాద బీమా ఐదు లక్షలు, సాధారణ మరణం మట్టి ఖర్చులకు పదివేలు ఇన్సూరెన్స్ ద్వారా లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో గంజిపేట గ్రామ పెద్దలు బొండా రమణ, పూసల శ్రీనివాసరావు, గంజి రాజు, గంజి అప్పలరాజు, సిపాన వాసు, తురసాల అప్పారావు, శివ, మూర్తి పాల్గొన్నారు.

మాజీ సిఎం జగన్‌ను కలిసిన పైలా

ప్రజాశక్తి-పరవాడ : మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వై.ఎస్ జగన్మోహన్ రెడ్డితో ఆ పార్టీ రాష్ట్ర సీఈసీ సభ్యులు పైల శ్రీనివాసరావు మంగళవారం భేటీ అయ్యారు. తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో జగన్మోహన్ రెడ్డిని కలిసి నియోజకవర్గంలో రాజకీయపరమైన అంశాలపై సుమారు గంట పాటు చర్చించారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై వైఎస్ జగన్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పైల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజల గురించే నిత్యం పరితపించే జగనన్న మళ్లీ నూతన ఉత్సాహంతో కనిపించారన్నారు.

పశువుల్లో ఎంఎంఆర్‌పై అవగాహన

ప్రజాశక్తి-కశింకోట : పశువుల్లో యాంటిబయాటిక్ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఎఎంఆర్) వాడకంపై అవగాహన కల్పించుకోవాలని పశు వైద్యులు అల్ఫేన్స్ జార్జ్, చైతన్య మణి, డయానా సూచించారు. బుధవారం వారు ప్రజాశక్తితో మాట్లాడుతూ ఎఎంఆర్ పశువులలో అధికశాతం వాడకూడదని సూచించారు. యాంటిబయాటిక్స్ వాడకం వల్ల ఇన్ఫెక్షన్ల చికిత్స కష్టమవుతుందని, పశువుల ఆరోగ్యం, మానవ ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని తెలిపారు. వ్యాధుల నివారణ కన్నా వ్యాధి పెరుగుదల లేకుండా యాంటిబయాటిక్స్‌ను ఎక్కువగా వాడడం జరుగుతుందని చెప్పారు.

చోడవరం సుగర్స్‌లో రస నాణ్యత పరీక్షలు

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం చక్కెర కర్మాగారంలో బుధవారం స్థానిక ఎండి వి సన్యాసినాయుడు రస నాణ్యత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన క్రషర్‌లో చెరుకుని వేసి క్రషింగ్ పనులకు అంకురార్పణ చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ నెలలో చెరుకు గాను గాడుట ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్‌పై ఎమ్మెల్యే ఫిర్యాదు

ప్రజాశక్తి- కె.కోటపాడు : స్థానికుల నుండి అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కే కోటపాడు సబ్ రిజిస్ట్రార్ సత్యనారాయణపై ఉన్నతాధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డిఐజికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. రెండు నెలల క్రితం బదిలీపై ఇక్కడికి వచ్చిన సబ్ రిజిస్ట్రార్ సత్యనారాయణ డబ్బులు కోసం స్థానిక డాక్యుమెంట్ రైటర్స్‌ను పలు ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ అనుమతులు లేని లేఅవుట్ల ప్లాట్ల రిజిస్ట్రేషన్లు ఎక్కువ కమీషన్‌కు ఆశపడి బల్క్‌గా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పెందుర్తి సబ్బవరం తదితర ప్రాంతాలకు సంబంధించి రిజిస్ట్రేషన్లు ఇక్కడే చేస్తున్నారని, కే కోటపాడు దేవరాపల్లికి చెందిన వ్యవసాయ భూములు రిజిస్ట్రేషన్‌లపై కొర్రీలు వేసి పక్కన పెడుతున్నారని స్థానిక రైటర్స్ ఆరోపిస్తున్నారు. ఇవన్నీ ఇటీవల ఒక దినపత్రికలో (ప్రజాశక్తి కాదు) రావడంతో ఎమ్మెల్యే బండారు అధికారులకు ఫిర్యాదు చేశారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు


అనకాపల్లిలో మాట్లాడుతున్న ఆళ్ల గోవిందరావు

ప్రజాశక్తి - అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా హైస్కూల్ విద్యార్థులకు పద్యపఠన పోటీలు జరిగాయి. అనంతరం జరిగిన సభలో జర్నలిస్టు మార్టూరు అజయ్, మార్టూరు హైస్కూల్ హెచ్ఎం కొత్తపల్లి విజయ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ ఆళ్ల గోవిందరావు, సీనియర్ నటులు కెవిఎల్ నారాయణ, వియ్యపు సింహాచలం, జగన్, శివాజీ పాల్గొన్నారు. పట్టణంలోని శాఖాగ్రంథాలయంలో ముగింపు వేడుకల్లో వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు మహిళా పోలీసు స్టేషన్ ఎస్ఐ. పి.రాములమ్మ బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఏ శ్రీనివాసరావు, బల్ల నాగభూషణం పాల్గొన్నారు.

యలమంచిలి : స్థానిక గ్రంథాలయంలో ు పాటు వివిధ రంగాల్లో జరిగిన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ బి.చంద్రశేఖర్, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఎం.విజయకుమార్, కొక్కిరాపల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.మాణిక్యం, చార్టర్డ్ అక్కౌంటెంట్ బండారు బంగారుశెట్టి, గ్రంథాలయాధికారి పాల్గొన్నారు.

మునగపాక : స్థానిక శాఖ గ్రంథాలయంలో ఎంఇఒ బి.శివ నాయుడు, జడ్పీహెచ్ స్కూల్ హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు మాట్లాడారు. గ్రంథాలయాధికారి ఎల్వి రమణ, విశ్రాంత హెచ్ఎం పెంటకోట తులసిరావు, ప్రణతి విద్యానికేతన్ కరస్పాండెంట్ సతీష్ పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట గ్రంథాలయం వారోత్సవాలు ముంగిపు కార్యక్రమంలో తహశీల్దారు అడబాల శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. ఎంఇఒ వెంకటసురేష్, సూర్య నారాయణ మూర్తి, గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్ కవిత, గ్రంథాలయాధికారి వరలక్ష్మి పాల్గొన్నారు.

అచ్యుతాపురం : అచ్యుతాపురం శాఖ గ్రంథాలయంలో ముగింపు కార్యక్రమంలో సిఐ నమ్మి గణేష్ పాల్గొని మాట్లాడారు. గ్రంథాలయ అధికారి దొడ్డి కోటేశ్వరరావు ఆధ్వర్యాన బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం ఎం పద్మ, అచ్యుత స్కూల్ కరస్పాండెంట్ పల్లి శేషగిరిరావు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : బుచ్చెయ్యపేట శాఖ గ్రంథాలయంలో ముగింపు కార్యక్రమానికి ఎంఇఒ బి.కాశీ విశ్వేశ్వరరావు, ఎస్ఐ ఎ.శ్రీనివాసరావు హాజరై పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయాధికారి వి.కృష్ణారావు, పాల్గొన్నారు.

సబ్బవరం : సబ్బవరం శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయం అధికారి వి. శిరీష ఆధ్వర్యంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో ఎంపిపి బోకం సూర్యకుమారి, గ్రామ సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, ఎంఈఓ లక్ష్మణరావు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపిటిసి వై రాము పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయాల వారోత్సవాలలో ప్రిన్సిపాల్ బి సీతాలక్ష్మి మాట్లాడారు.

చీడికాడ:గ్రంథాలయంలో పుస్తకాలు, దినపత్రికలు చదవడంతో విద్యార్థులు విజ్ఞానం సముపార్జించ వచ్చునని సర్కిల్ ఇన్స్పెక్టర్ సతీష్ తెలిపారు. మండలం కేంద్రంలో శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. గ్రంథాలయ అధికారిని ఎన్ఎస్ఎల్ జోగేశ్వరి,హెడ్ కానిస్టేబుల్ గోవిందు, వ్యాయామ ఉపాధ్యాయురాలు మల్లేశ్వరి, ప్రసాద్ పాల్గొన్నారు

నక్కపల్లి:మండలంలోని చినదొడ్డిగల్లులో గ్రంథాలయ అధికారి కె.జనార్ధన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ముగింపు వేడుకల్లో గ్రామ సర్పంచ్ బొల్లం చంద్రరావు, బండారు ఛారిటబుల్ వ్యవస్థాపకులు బండారు గోవిందరావు, స్థానిక హైస్కూల్ హెచ్.ఎమ్. బి.కవిత ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి వెలగా ఈశ్వరరావు, జనసేన పార్టీ మండల శాఖ అధ్యక్షులు వెలగా సుధాకర్, గ్రామ పెద్దలు రమేష్ రాజు, తెలుగు ఉపాధ్యాయుడు ఆచార్యులు పాల్గొన్నారు.

నర్సీపట్నంటౌన్: స్థానిక శాఖ గ్రంథాలయంలో జరిగిన ముగింపులో ఎంఈఓ తలుపులు, అల్లూరి సీతారామరాజు డిగ్రీ కళాశాల విశ్రాంత అధ్యాపకులు, ప్రముఖ సాహితీవేత్త జెట్టి ఎల్లమంద మాట్లాడుతూ విద్యార్థుల్లో గల ప్రతిభను వెలికితీయడానికి వారోత్సవాలు దోహదపడతాయన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.త్రిమూర్తులు, లైబ్రేరియన్ పి. దమయంతి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కె.వి.సుబ్బారావు, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు కె. విజయకుమారి, విశ్రాంత లైబ్రేరియన్ జి.మురళీకృష్ణ, పి.ప్రభాకరరావు, ఎ. నూకరాజు (వేములపూడి), ఎన్. మంగలక్ష్మి (దువ్వాడ), పాల్గొన్నారు.

కోటవురట్ల: మండల కేంద్రంలో శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి గ్రంథాలయ అధికారి అప్పలనాయుడు బహుమతులు అందజేశారు. ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, ఎంఈఓ రామారావు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

మాడుగుల: మాడుగుల శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి వై.వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు గ్రామ పెద్దలు, అధికారులు బహుమతులు అందజేశారు. సర్పంచ్ యద్ద కళావతి , వైస్ సర్పంచ్ జువ్వాడి వరహాలు, వైఎస్ సర్పంచ్ డి .సూర్యారావు , ఆర్య వైశ్య సంఘం ఉపఅధ్యక్షుడు శ్రీనాధ శ్రీనివాసరావు, జనసేన పార్టీ నేతలు రొబ్బ మహేష్, పంచాయతీ ఈఓ .మూర్తిబాబు ఉపాధ్యాయులు శివయ్య పాల్గొన్నారు.

కె జె పురం గ్రంథాలయంలో విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

రోలుగుంట:రోలుగుంట శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి ఎస్.వరలక్ష్మి ఆధ్వర్యంలో ముగింపు వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రోలుగుంట హైస్కూల్ హెచ్ఎం ప్రసాద్, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు శర్మ, కొమరవోలు ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకటరావు, తెలుగు ఉపాధ్యాయులు ఆర్ఎస్.ప్రసాం, కేజీబీవీ రేవతి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ:గొలుగొండ శాఖ గ్రంధాలయంలో గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో ముగింపు వారోత్సవాలను నిర్వహించారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఉపాధ్యాయులు రమణమ్మ, వరలక్ష్మి, జోగుంపేట హైస్కూల్ ఉపాధ్యాయులు అప్పారావు, శ్రీనివాస్, చిరంజీవి, చోద్యం నుండి శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : విద్యార్థులు మొబైల్ ఫోన్ల వినియోగానికి, సోషల్ మీడియాకు దూరంగా


మాడుగులలో బహుమతులు ఇస్తున్న గ్రంథాలయాధికారి

ఉండాలని, పుస్తకాలకు దగ్గర కావాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ పిలుపునిచ్చారు. నెలకొక్క పుస్తకమైనా చదవాలనే ప్రతిజ్ఞతో ప్రతి ఒక్కరూ ముందుకు వెళ్లాలని, భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. సూర్యాబాగ్లోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జాయింట్ కలెక్టర్ హాజరై మాట్లాడుతూ, ఎన్ని సాంకేతిక పరికరాలు అందుబాటులోకి వచ్చినప్పటికీ అవి పుస్తకాలకు సాటిరావన్నారు. గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థులకు జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. జిల్లా గ్రంథాలయాల సంస్థ కార్యదర్శి ఆర్.సి.హెచ్ వెంకటరావు, వయోజన విద్యాశాఖ డిడి చిన్నికృష్ణ, డిప్యూటీ డిఇఒ సోమేశ్వరరావు, డివిజనల్ పిఆర్ఓ నారాయణరావు, ఎంఇఒలు పైడంనాయుడు, పుష్పరాగం, లైబ్రేరియన్లు పాల్గొన్నారు.

ఎంవిపి కాలనీ : ఎంవిపి.కాలనీలోని నగర శాఖ గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు సభ, బహుమతి ప్రధాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 18వ వార్డు కార్పొరేటర్ గొలగాని మంగవేణి, పోలారావు, గ్రంథాలయాధికారి కెవిఎ ఉమామహేశ్వరరావు, వైశ్యరాజు జ్యువెలర్స్ అధినేత నరేష్ రాజు, కెబిఆర్ ఈవెంట్ యజమాని కె.బాబూరావు, సామాజిక కార్యకర్త సత్య కుమార్, ప్రముఖ రచయిత సుసర్ల సర్వేశ్వర శాస్త్రి పాల్గొన్నారు

ఆనందపురం : స్థానిక శాఖగ్రంథాలయాన్ని గంభీరం ఐఐఎం లైబ్రరీ అధికారులు సందర్శించారు. గ్రంథాలయం లో పుస్తకాల అమరికను, రిజిస్టర్ల నిర్వహణను పరిశీలించారు. ఆనందపురం శాఖ గ్రంథాలయానికి 11 ఇంగ్లీష్ పుస్తకాలను బహూకరించారు. స్థానిక లైబ్రేరియన్ బివిఎస్ అప్పారావు, గంభీరం ఐఐఎం సీనియర్ లైబ్రేరియన్ డాక్టర్ ఎస్ఎన్ విఘ్నేష్, జూనియర్ సూపరింటెండెంట్ పి.ఇందు, లైబ్రరీ అసిస్టెంట్లు స్వాతి, శ్రీను, బి.కనకమహేశ్వరి పాల్గొన్నారు.

.ములగాడ : విజ్ఞానవంతమైన సమాజ నిర్మాణానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు, పారిశ్రామికవేత్తలు, ఉద్యోగులు, రాజకీయవేత్తలు కలిసికట్టుగా పనిచేయాలని హెచ్పిసిఎల్ పిఆర్ఒకాశీ అన్నారు. మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో మాట్లాడారు. లైబ్రేరియన్ వి. అజయ్కుమార్ ఆధ్వర్యంలోనిర్వహించిన కార్యకరమంలో హెచ్పిసిఎల్ సీనియర్ అధికారి సుమన్ కుమార్, సెయింట్ ఆన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రేమకుమారి పాల్గొని వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, వై.అనసూయాదేవి, మల్కాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్,కవి కె.సత్తిరాజు పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు ముగిశాయి. శాఖా గ్రంథాలయ అధికారి ఎస్ మహేష్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. మాజీ కౌన్సిలర్లు గంటా నూకరాజు, మైలపల్లి లక్ష్మణరావు, పాల్గొన్నారు. తగరపువలస అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి మురళీకృష్ణ, బేసిక్ సైన్స్ అండ్ హ్యూమనటీస్ విభాగాధిపతి జెఆర్జె పట్నాయక్, అధ్యాపకులు శ్రీనివాసరావు, చంద్రకళ పాల్గొన్నారు

సచివాలయ ఉద్యోగులకు బయోమెట్రిక్ తప్పనిసరి

ప్రజాశక్తి -నక్కపల్లి:సచివాలయ ఉద్యోగులకు బయో మెట్రిక్ నమోదు మేరకు మాత్రమే వేతనం అప్ లోడ్ చేయాలని ఎంపిడీవో డి సీతారామరాజు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడీవో మాట్లాడుతూ, స్వర్ణ పంచాయతీ వెబ్ సైట్లో ఇంటి పన్నుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. హెచ్హెచ్, ఎన్పి సీఐ సర్వే నూరు శాతం పూర్తి చేయాలన్నారు.


మాట్లాడుతున్న ఎంపిడీవో

క్వారీ అనుమతులను నిలిపేయాలి

ప్రజాశక్తి-రావికమతం:రావికమతం మండలం తోటకూరపాలెం గ్రామంలో ఉష్మశ్రీ కలర్ గ్రానైట్ క్వారీ పరిశ్రమ ఏర్పాటుతో ప్రజలందరూ వ్యాధుల బారిన పడే అవకాశం ఉన్నందున క్వారీ అనుమతులను నిలిపేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. తోటకూర పాలెం గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్వారీకి అనుమతులు ఇస్తే తోటకూరపాలెం గ్రామం కిడ్నీ వ్యాధులకు నిలయంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.స్థానికులకు ఉపాధి కల్పించకుండా బయటి వారిని క్వారీ పనులకు అవసరమైన కార్మికులను తీసుకొని వస్తున్నారన్నారు .క్వారీతో చుట్టుపక్కల పశువులు, గొర్రెలు మేకలను పెంచుకోవడానికి పశుగ్రాసం లేకుండా పోతుందన్నారు.తోటకూర పాలెం నుండి కన్నూరు పాలెం వెళ్లే రహదారి గ్రానైట్ క్వారీ పరిశ్రమ వల్లే పూర్తిగా దెబ్బతిందని తెలిపారు.

ఆధార్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి- మాడుగుల:మండలంలోని తాటిపర్తి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్ ను బుధవారం ఎంపిడీవో కొంకి అప్పారావు పరిశీలించారు. గిరిజన ప్రాంతం కావడంతో సర్వర్లు మొరాయించడంతో గిరిజన బాలిక ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న పిల్లలందరికీ పూర్తిస్థాయిలో అన్ని కరెక్షన్స్ నిర్వహించే వరకు ఆధార్ సేవలు కొనసాగిస్తామని తెలిపారు. మిగిలిన కెజె పురం, ఎల్.పొన్నవోలు, కింతలి, వల్లాపురం సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంపు 29వ తేదీ ముగిస్తామని తెలిపారు. ఆధార్ నమోదు చేసుకున్న 18 ఏళ్ల నిండిన వారికి ప్రభుత్వ పరంగా అందే అన్ని పథకాలు వర్తిస్తాయన్నారు. ఒచున్నాయి.

కొనసాగుతున్న హెల్త్ సర్వే

ప్రజాశక్తి -కోటవురట్ల:ఈనెల 14 నుంచి నిర్వహిస్తున్న ఆరోగ్య సర్వే గ్రామీణ ప్రాంతాల్లో పి.హెచ్.సి వైద్య సిబ్బంది చేపడుతున్నారు. వివిధ ఆరోగ్య సమస్యలు, వ్యాధులపై మండల వ్యాప్తంగా సర్వే నిర్వహిస్తున్నారు. టిబి, కుష్ఠు, క్యాన్సర్ సహ బీపీ, షుగర్, హిమోగ్లోన్, కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధుల లక్షణాలు వివరిస్తూ గ్రామీణ ప్రాంత ప్రజలను సిబ్బంది అడిగి తెలుసుకుంటున్నారు.

చోద్యం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ శాఖ గ్రంథాలయంలో 57వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన క్విజ్, రంగవల్లిక పోటీల్లో మండలంలోని చోద్యం హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. పాఠశాల విద్యార్థులు రంగవల్లికలో ప్రథమ స్థానం, క్విజ్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించారని హెచ్ఎం పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా పీఈటీ కుందూరు నూకరాజు, చైర్మన్ పి.సత్తిబాబు, ఉపాధ్యాయులు సిహెచ్వి.రమణ, వరప్రసాద్, వాసు, గ్రామ పెద్దలు అభినందించారు.

తాగునీటి బోరుకు శంకుస్థాపన

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:ఆయుష్ హాస్పటల్లో తాగునీటి బోరు పనులకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు సతీమణి, కౌన్సిలర్ చింతకాయల పద్మావతి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 9 లక్షల నిధులను మంజూరు చేసినందుకుగాను స్పీకర్కి కృతజ్ఞతలు తెలిపారు. అప్పటి మంత్రిగా ఉన్న కాలంలో ఈ హాస్పటల్ నిర్మాణంకు 20 లక్షలు మంజూరు చేశారని, వై సి పి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో హాస్పటల్ అభివృద్ధి పనులు ఆగిపోయాయన్నారు. ఈ కార్యక్రమంలో డిఈ నాగేశ్వరరావు, ఏఇ సుధాకర్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ సత్యనారాయణ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే గణేష్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ జన్మదినోత్సవ వేడుకలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు ఆధ్వర్యంలో వేడుకగా జరిగాయి. నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే గణేష్ కు జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలియజేయడానికి నర్సీపట్నం క్యాంప్ కార్యాలయానికి కార్యకర్తలు, నాయకులు భారీగా తరలివచ్చారు. గజమాలతో గణేష్ దంపతులను సత్కరించారు. సుమారు 15 కేజీల కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ, తనపై అభిమానంతో ఇక్కడికి విచ్చేసిన అభిమానులకు కార్యకర్తలకు నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సుబ్బలక్ష్మి, మాజీ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసి పాత్రుడు (జమీల్), గొలుసు నరసింహమూర్తి, నాతవరం ఎంపిపి సాగిన లక్ష్మణమూర్తి, గొలుగొండ ఎంపీపీ మణికుమారి, నర్సీపట్నం ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, జడ్పిటిసి సుర్ల గిరిబాబు, మాకవరపాలెం మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రుత్తల వాసు, నర్సీపట్నం మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుర్ల సత్యనారాయణ, మున్సిపల్ కౌన్సిలర్లు సిరస పల్లి, బేతిరెడ్డి రత్నం పాల్గొన్నారు.

గొలుగొండ:నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల


గణేష్ దంపతులను సత్కరిస్తున్న నాయకులు

ఉమాశంకర్ గణేష్ జన్మదిన వేడుకలను గొలుగొండ మండలంలో ఘనంగా నిర్వహించారు. గొలుగొండ వైస్ ఎంపిపి జక్కు నాగమణి, సర్పంచ్లు కసిపల్లి అప్పారావు, పోలిరెడ్డి రాజబాబు, యలమంచిలి రఘురామ చంద్రరావు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

కైలాస పట్నంలో పారిశుధ్య పనులు

-ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలోని కైలాస పట్నం గ్రామంలో అధికారులు స్పందించి పారిశుధ్య పనులు చేపట్టారు. అపారిశుద్యానికి అడ్డాగా కైలాస పట్నం అంటూ మంగళవారం ప్రజాశక్తి లో వచ్చిన కథనంపై సచివాలయ అధికారులు స్పందించారు. రాజపేట రహదారికి వెళ్లే దారిలో చెత్తను జెసిపి సహాయంతో తొలగించారు,.ఇక్కడ చెత్తను దీర్ఘకాలిక వదిలేయడంతో దుర్గంధం వెదజల్లేది. గ్రామస్తులు వాహనదారులు ఇబ్బందులు పడేవారు.



చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

ఆదివాసీల వినూత్న నిరసన

ప్రజాశక్తి-రోలుగుంట:జగనన్న రీ సర్వేలో భాగంగా కొంత మంది రెవెన్యూ అధికారులు కుమ్మక్కై గిరిజనేతరుల పేరిట పట్టాలు ఇచ్చారని, వాటిని వెంటనే రద్దు చేయాలంటూ రోలుగుంట మండలం పనసలపాడు ఆదివాసీ గిరిజనులు బుధవారం చేతులు జోడించి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామ రెవెన్యూ పరిధిలో ఆదివాసీ గిరిజనులు తమకు ఉన్న జిరాయితీ భూముల్లో సర్వే నెంబరు 8-1, 6-9, 6-1 రత్నం మాజీ సర్పంచ్‌తో పాటు మరికొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు 12 ఎకరాలు రాసిచ్చేశారని ఆరోపించారు. వాటి పట్టాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామన్నారు.



శ్మశాన వాటికలో ఆక్రమణలు తొలగించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని రేబాకలో దళితుల శ్మశాన వాటిక సర్వే చేపట్టి ఆక్రమణలు తొలగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు కోరారు. బుధవారం తహసిల్దార్ నరసింహామూర్తికు గ్రామ దళితులతో కలిసి వినతిపత్రం అందజేసారు. ప్రస్తుతం శ్మశాన స్థలం ఆక్రమణకు గురైందని, అంతేకాకుండా ఎవరైనా మరణించినప్పుడు సమాధి చేసినప్పుడు ఫారెస్ట్ అధికారులు వచ్చి అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి సర్వే చేపట్టి ఆక్రమణలు తొలగించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో నాయకులు ఎం.సత్యనారాయణ, ఎం.రాజేష్ పాల్గొన్నారు.

దళిత సంఘాల నిరసన

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం కన్నంపేట శ్రీ రామ నగర్ కాలనీ లో సిఎస్ఎఫ్ కాన్సిస్టేబుల్ మంతిన శేఖర్, అతని తల్లి నాగమణి, తండ్రి సూరిబాబు తమ పై దుర్భషాలాడుతూ చర్చ్ ఖాళీ చేయాలని హెచ్చరిస్తున్నారని కొత్తకోట కు చెందిన దళితుడు కిడారి మల్లేష్ ఆందోళన వ్యక్తం చేశారు.. చర్చి ఖాళీ చేసి వెళ్లి పోవాలని హెచ్చరిస్తూ మరో తాళం వేశారని ఆయన చెప్పారు. ఆదివారం జరిగిన ఈ సంఘటన పై కొత్తకోట పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు. దళిత సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిరసన చేపట్టారు. బాధితుల కథనం మేరకు కన్నంపేట శ్రీ రామ నగర్ కాలనీ లో కొత్త కోట కు చెందిన తాను ఫాస్టర్ గా దైవ సేవా కార్యక్రమాలు గత పదేళ్లు కిందట చేపట్టానన్నారు. తన సేవను గుర్తించిన సి ఎస్ ఎఫ్ కాన్సిస్టేబుల్ మంతిన శేఖర్ కుటుంబ సభ్యులు కొంత స్థలాన్ని చర్చ్ నిర్మాణానికి విరాళం గా 2016 లో లిఖిత పూర్వకంగా రాసి యిచ్చారన్నారు. దానిలో సుమారు రూ 10 లక్షలు అప్పు చేసి గ్రామస్తుల సాయంతో దేవాల యం భవనం నిర్మించామన్నారు. ఆ నిర్మాణంలో కానిస్టేబుల్ కుటుంబం కూడా పాల్గొన్నారని తెలిపారు. అప్పటి నుంచి ఆ భవనంలో గ్రామస్తులతో దైవ సేవా, ప్రార్ధనలు కొన సాగించు కుంటున్నామన్నారు. గత రెండేళ్లు కిందట వరకూ సి ఎస్ ఎఫ్ కుటుంబ సభ్యులు కూడా ప్రార్ధనలలో పాల్గొన్నారన్నారు.వారం రోజుల కిందట సి ఎస్ ఎఫ్ కాన్సిస్టేబుల్ తనకు ఫోన్ చేసి చర్చ్ తొలగించాలని లేదంటే తానే ధ్వంసం చేస్తానని బెదిరిస్తున్నారన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు.

విజ్ఞాన వినోదాల కలయికతో విశాఖ బాలోత్సవం



నృత్య ప్రదర్శనలిస్తున్న బాలికలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : నగరంలోని సెయింట్ ఆంటోనీ పాఠశాలలో నిర్వహిస్తున్న విశాఖ బాలోత్సవం రెండో రోజైన బుధవారం ఉల్లాస ఉత్సాహాల హేలతో సాగింది. ఉదయం రుషికొండపై నిర్మాణాలను సైన్స్ మ్యుజియానికి ఉపయోగించాలి అనే అంశంపై వార్తా రచనతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. తెలుగు, ఇంగ్లీష్‌లో వక్తృత్వం పోటీలు, పంచతంత్ర కథలు వాటి ప్రభావం, థామస్ ఆల్వా ఎడిసన్ పరిశోధనలు వాటి విశిష్టత, మన జీవితంపై సెల్ ఫోన్ ప్రభావం, గ్లోబల్ వార్మింగ్ మానవాళిపై ప్రభావం, కృత్రిమ మేధస్సు - భవిష్యత్తు దర్శనం, నిత్య జీవితంలో సైంటిఫిక్ టెంపర్ తెలుగు కథా రచన కంట్రోల్ తప్పిన రోబో, నేను ఒక శాస్త్రవేత్త అయితే... (కల్పిత కథ), మూఢనమ్మకం -సైన్స్, టైం ట్రావెల్ (కాల యాత్ర), మానవ క్లోనింగ్, పే బాక్ టు సొసైటీ (సమాజానికి తిరిగి ఇవ్వడం), తెలుగు కవితా రచన సీనియర్లకు సెల్ ఫోన్ (దూరవాణి), ప్రకృతి,శాస్త్రం గురించి ఒక కవిత, స్కూల్ లైఫ్, డిబేట్ (సీనియర్లు), కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్) అనుకూల ప్రతికూల వాదనలు. గ్లోబల్ వార్మింగ్ (భూతాపం) నివారించడం సాధ్యమా? భష్మాసుర కథకు విశ్లేషణ వంటి అకడమిక్ అంశాలపై పోటీ నిర్వహించారు. వీటితో పాటు లఘు నాటికలు, జానపద, దేశభక్తి, ఏక పాత్రాభినయం, క్లాసికల్, మూకాభినయం,



పలు ఆటల్లో పాల్గొన్న చిన్నారులు



సాంస్కృతిక ప్రదర్శనలిస్తున్న బాలురు

వాయిద్య పరికరాల సంగీతం వంటి సాంస్కృతిక అంశాలలో పోటీలు జరిగాయి. అన్ని అంశాలలో విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. ప్రస్తుతం సమాజం ఎదుర్కొంటున్న సామాజిక అంశాలను తీసుకొని నాటికలు వేయగా , పౌరాణిక వేషధారణలతో అలరించారు. ఏకపాత్రాభినయంలో అల్లూరి, అంబేద్కర్, వ్యసన పరులు వంటి అంశాలను ప్రదర్శించారు. సైనికులు, రైతులు, దేశభక్తి అంశాలపై నిర్వహించిన ప్రదర్శనలకు, బాలోత్సవ వేదికలు సాక్ష్యంగా నిలిచాయి. మొదటి రోజు కంటే ఎక్కువమంది రెండవ రోజు పాల్గొనడం మరింత ఉత్సాహాన్ని కలిగించింది.

రైతుల అనుమతులు లేకుండా...

భూములు సర్వే చేయడం సరికాదు



రైతులతో మాట్లాడుతున్న అప్పలరాజు

ప్రజాశక్తి- నక్కపల్లి:రైతులు, గ్రామ ప్రజలు అనుమతులు లేకుండా సర్వే ఎలా చేస్తారని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం అప్పలరాజు ప్రశ్నించారు. మండలంలోని పెద తీనార్ల పంచాయతీ దొండవాక గ్రామంలో బుధవారం స్థానికులతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు, రైతులకు ఏ విధమైన ఏ విధమైన సమాచారం ఇవ్వకుండా అధికారులు భూములను సర్వే చేస్తున్నారని, సర్వే ఎందుకు చేస్తున్నారని అడుగగా తెలియదని బదులిచ్చారని, వాస్తావాలు చెప్పకుండా సర్వే చేపడుతూ రైతులను మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం రైతులకు తెలియజేయకుండా,రైతులు ఆమోదం లేకుండా భూములలో కి జిల్లా కలెక్టర్ సైతం వెళ్ళకూడదని,ఏవిధమైన సర్వేలు చేయకూడదని అయినప్పటికీ నక్కపల్లి, ఎస్.రాయవరం మండల రెవెన్యూ అధికారులు 2013 భూ సేకరణ చట్టాన్ని ఉల్లంఘించి సర్వే లు చేపడుతున్నారని దీనిని ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు.

రైతులు యొక్క అభిప్రాయాన్ని ద్రష్టి లో పెట్టుకొని వెంటనే భూములు సర్వేలు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే నక్కపల్లి మండలం లో 5,500 ఎకరాలు భూములు సేకరించారని, నేటికీ భూములు కోల్పోయిన రైతులను, నిర్వాసితులకు పూర్తి స్థాయిలో పరిహారం, ప్యాకేజీ, పునరావాసం కల్పించలేదన్నారు. రైతులు దగ్గర కారు చౌకగా భూములు సేకరించి, కార్పొరేట్ కంపెనీలకు కోట్లాది రూపాయలకు వందల ఎకరాలు భూములు కట్టబెడుతున్నారని తద్వారా రైతుల నోట్లో మట్టి కొడుతున్నారని ఆవేదన రక్తం చేశారు. భూములు పై ఆధారపడి జీవిస్తున్న రైతులు, కూలీలకు ఉపాధి లేకుండా చేసి, సముద్ర తీరాన్ని డంపింగ్ యార్డు గా మార్చి, మత్స్యకారుల జీవనోపాధిని,ఆరోగ్యాలను దెబ్బ తీస్తున్నాన్నారు. భూములు సర్వే వెంటనే నిలుపుదల చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.సత్యనారాయణ, సిఐటియు మండల కన్వీనర్ ఎం.రాజేష్, నాయకులు ఎం.లోవరాజు, ఎం.మధు, ఎం.కాశీసోమోరు, పి.లోవరాజు, కె.నాగమణి తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాన్ని ఇస్తున్న ప్రిన్సిపల్

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి -ఎస్ రాయవరం:రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు స్తానిక ప్రజ్ఞ కాలేజీ విద్యార్థి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాపర్తి రాము తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ, శ్రీ ప్రజ్ఞ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రధమ సంత్సరం చదువుతున్న కొలనాటి సాయిరాం యస్‌జిఎఫ్‌ఆఫ్ ఏపి నిర్వహించిన అండర్-19 డిస్ట్రిక్ హాకీ ఛాంపియన్ షిప్ లో ప్రధమ స్థానంలో నిలిచి స్టేట్ టీం కు ఎంపికయినట్లు తెలిపారు. వచ్చే నెల జార్కండ్ లో జరిగే నేషనల్ హాకీ షిప్‌లో ఆంధ్ర తరుపున ఆడనున్నాడన్నారు. సాయిరాంను అధ్యాపకులు రాపర్తి రాము, నూకరాజు, రాజు, ప్రవీణ్, ప్రకాష్,నాగరాజు అభినందించారు.

నిధులు సమకూర్చడానికి కృషి

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం కొత్తకోట గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఇటీవలే ప్రారంభోత్సవం చేసుకున్న చెత్త నుండి సంపద తయారీ కేంద్రానికి సమీప పరిసరాల స్థలంలో జంగిల్ తొలగింపుకు రావికమతం ఎంపిపి పైల రాజు బుధ వారం భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా ఎం పిపి రాజు మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో మంచి వాతావరణం కల్పించాలన్న సంకల్పంతో పచ్చదనంతో పాటు ఆహ్లాదకరంగా అభివృద్ధి చేయడానికి అవసరమైన నిధులు సమకూర్చడం కోసం కృషి చేస్తానన్నారు.. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోన లోవరాజు, జెడ్పిటిసి భర్త తలారి ఆదిమూర్తి, ఉపసర్పంచ్ పందల దేవ, మండల వైసీపీ ప్రధాన కార్యదర్శి శీలం శంకర్రావు, ఎంపిటిసి పూడి దేవ, మండల కో ఆప్షన్ ఎంపిటిసి గాలి రమణ బాబు, పంచాయతీ వార్డు సభ్యులు గుమ్ముడు దొరబాబు, గుమ్ముడు పెద్దమ్ములు, డి నాగ సీత తదితరులు పాల్గొన్నారు.....

తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటుకు చర్యలు

-ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - మాడుగుల: మండల కేంద్రంలోని 14వ వార్డు టీచర్స్ కాలనీలో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న అంశంపై మంగళవారం ప్రజాశక్తి దినపత్రికలో అటు వృధా ఇటు వ్యధ పేరుతో కథనం ప్రచురితమైంది. తాగునీటి పైప్‌లైన్ పనులు బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ ఎస్.నాగ మల్లేశ్వరి మాట్లాడుతూ, మండల కేంద్రంలోని జలజీవన్ మిషన్ పథకం కింద 3500 ఇళ్లకు నీటి సరఫరా చేయవలసి ఉండగా, ఇప్పటికే 80 శాతం ఇళ్లకు కొళాయిలు ద్వారా నీరు అందిస్తున్నామని తెలిపారు. టీచర్స్, అర్బన్ కాలనీకి సంబంధించి నూతన రోడ్లు వేయడంతో పనులు జాప్యం జరిగాయన్నారు. త్వరితగతిన పైపులైన్లు పనులు పూర్తి చేసి వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద 40వేల లీటర్లు సామర్థం గల రక్షిత మంచినీటి పథకం ట్యాంక్ పూర్తయిందని, బోరును తీసి ట్యాంక్ ద్వారా లైన్ కలపాల్పి ఉందన్నారు.కాలనీలో వేసిన కుళాయిలే కాకుండా, మిగిలిన కనెక్షన్లు పూర్తిచేసి ట్యాప్ల ద్వారా ఈ నెలాఖరు నాటికి నీటి సరఫరా పూర్తి స్థాయిలో అందిస్తామని ఏఈ తెలిపారు.



చేపడుతున్న పైప్‌లైను పనులు

రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని ఎంకె.పట్నం శివారు కొరుప్రోలు రోడ్డుకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు కోటి 50లక్షలను ఇటీవల చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు మంజూరు చేయించారు. ఈ మేరకు బుధవారం రోడ్డు ఫార్మేషన్ పనులను జేసిబితో చేపట్టారు. ఎన్నో ఏళ్ల నుండి కొరుప్రోలు గ్రామస్థులు రహదారి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎట్టకేలకు రోడ్డు మంజూరు అయి పనులు ప్రారంభం కావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.



చేపడుతున్న పనులు

శరవేగంగా గ్రంథాలయ నిర్మాణ పనులు

ప్రజాశక్తి -రావికమతం: రావికమతం మండలం గర్నికం కస్తూరిబా గాంధీ పాఠశాల లైబ్రరీ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని పాఠశాల చైర్మన్ కొలిమాల జగన్నాథం తెలిపారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాలలో లైబ్రరీ నిర్మాణానికి ప్రభుత్వం సర్వ శిక్ష అభియాన్ నిధులు 20 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పనకు పాఠశాలకు అవసరమైన నిధుల సేకరణకు స్థానిక గ్రామ పార్టీ నాయకులతో కలిసి సేకరించి అభివద్ధి చేయడానికి తన వంతుగా కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల సంఘం అధ్యక్షులు, గ్రామ టిడిపి పార్టీ నాయకులు కేశం శెట్టి శ్రీను బాబు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.